విశాలాంధ్ర

ప్రకాశం
బాపట్ల

శుక్రవారం 27 సెప్టెంబర్ 2024 8 పేజీలు

దొరికినంత తవ్వుకో తవ్వుకుంది తోడుకో

- ఇష్టానుసారంగా ఇసుక అక్రమ తరలింపు
- కరకట్టలు, రైల్వే లైన్ మార్జిన్‌లు ధ్వంసం
- పట్టించుకోని ప్రభుత్వ యంత్రాంగం
- కలెక్టర్, సీఎంలకు ఫిర్యాదులు

> ఇష్టానుసారంగా ఇసుక తవ్వకాలు జరుగుతున్నా అధికారులు మిన్నకుంటున్నారు. అక్రమ ఇసుక తరలింపుతో వాహనరాకపోకలు ధాటికి కరకట్టలు పూర్తిగా నేలమట్టం అవుతున్నాయి. మరోపక్క రైల్వే ట్రాక్‌ల పక్కన కూడా ఈ తవ్వకాలు జరుగుతుండటంతో మరింత ముప్పుకు దారితీస్తుందని పలువురు ఆందోళన చెందుతున్నారు.

విశాలాంధ్ర - వేటపాలెం : ఇసుక అక్రమ తవ్వకాలకు అడ్డు అదుపూ లేకుండా పోతోంది. కరకట్టలు, రైల్వే లైన్ మార్జిన్‌లు ఇలా వరుసగా ధ్వంసమవుతున్నా అధికారులు పట్టించుకోవటం లేదు. వివరాల్లోకి వెళితే బాపట్ల జిల్లాలోని పందిళ్లపల్లి, రామన్నపేట, వేటపాలెం పంచాయతీల పరిధిలో విజయవాడ-చెన్నై రైల్వే లైన్ హద్దులు, మార్జిన్‌లలో అడ్డగోలుగా ఇసుక అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయి. ఈ తవ్వకాల వలన వేటపాలెం రైల్వే బ్రిడ్జి ప్రక్కన స్ట్రయిట్ కట్ కరకట్టపూర్తిగా నేలమట్టం అయ్యింది. ఈ వ్యవహారం స్థానిక అధికారులకు తెలిసినా చూసి చూడనట్లుగా వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా అక్రమ ఇసుక తవ్వకాలను అడ్డుకోవడంలో పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరించడమే కాకుండా అధికార విధులను దుర్వినియోగం చేస్తున్నారు. పందిళ్లపల్లి గ్రామ పరిధిలో జాతీయ రహదారి 216 మీద ఉన్నఫారెస్ట్ డిపార్ట్మెంట్ చెక్ పోస్ట్‌కు సమీపంలో విజయవాడ-చెన్నై రైల్వే లైన్‌కు పడమర హద్దు, మార్జిన్‌లలో అడ్డగోలుగా ఇసుక అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయి .రైల్వే మార్జిన్‌లలో ఇసుక అక్రమ తవ్వకాల సమయంలో రైల్వే యంత్ర సామగ్రి సైతం తవ్వి పడేసిన దృశ్యాలు తవ్వకాలు ఏ స్థాయిలో జరుగుతున్నాయో స్పష్టం చేస్తున్నాయి. ఇసుక రవాణాకు వినియోగిస్తున్న వాహనాల రాకపోకల ఆనవాళ్ళు గమనిస్తే ఇసుక అక్రమ రవాణా తీవ్రత ఏ విధంగా ఉన్నదో అర్థం చేసుకోవచ్చు. ఇసుక అక్రమ రవాణాదారులు ప్రభుత్వ భూములను ఆక్రమించి గేట్‌లను సైతం ఏర్పాటు చేసుకున్నారంటే ప్రభుత్వ యంత్రాంగం పనితీరు ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. రామన్నపేట పంచాయతీ లెప్రసీ కాలనీ ప్రక్కన జరిగిన అక్రమ తవ్వకాల ఆనవాళ్ళు, అక్రమ ఇసుక రవాణా విషయంలో విద్యుత్, రైల్వే, పంచాయితీరాజ్, పోలీస్, రెవెన్యూ శాఖ అధికారుల చిత్తశుద్ధి ఏ పాటిదో స్పష్టం చేస్తోంది. విద్యుత్ స్తంభాలు చుట్టూ ఇసుక తవ్వకాలు జరగటం వలన ద్వితీయ స్తంభాలు ఒరిగిపోయినా విద్యుత్ శాఖ పట్టీ పట్టనట్లు వ్యవహరిస్తోంది. రైల్వే బ్రిడ్జి వద్ద వేటపాలెం స్ట్రైట్ కట్ కరకట్ట మీద జరిగిన అక్రమ ఇసుక, మట్టి తవ్వకాల వలన కరకట్టలు పూర్తిగా నేలమట్టం అయ్యాయి. చీరాల నియోజకవర్గంలో కరకట్టల పరిరక్షణ విషయంలో డ్రైనేజీ శాఖ చిత్తశుద్ధి ఏపాటిదో స్పష్టం అవుతోంది.

- బాధ్యులెవరు..?

ఈ అడ్డగోలుగా రైల్వే ట్రాక్ పక్కన అక్రమ ఇసుక త్రవ్వకాల వలన భవిష్యత్‌లో రైలు ప్రమాదాలు జరిగి తీవ్ర ప్రాణ నష్టం జరిగే ఏ ప్రభుత్వ శాఖ బాధ్యత వహిస్తుంది.

- కలెక్టర్, సీఎంలకు ఫిర్యాదులు..

పందిళ్ళపల్లి నుండి వేటపాలెం రైల్వే స్టేషన్ మధ్య రైల్వే ట్రాక్ వెంబడి ఇసుక అక్రమ త్రవ్వకాలు అడ్డగోలుగా నిరంతరాయంగా జరుగుతున్నాయని ఫిర్యాదులు వెళుతున్నాయి. ఈ నేపథ్యంలోనే ఇటీవల యన్.నాగార్జున రెడ్డి అనే వ్యక్తి ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా బాపట్ల జిల్లా కలెక్టర్, ఈ-మెయిల్ ద్వారా ముఖ్యమంత్రి ఉప ముఖ్యమంత్రి ఇరిగేషన్ శాఖ మంత్రి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆర్డీఓలకు ఫిర్యాదు కూడా చేశారు.

• పాకల బీచ్‌ను అభివృద్ధి చేస్తాం..

పాకల బీచ్‌ను అన్ని విధాలా అభివృద్ధి చేస్తామని మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి అన్నారు. గురువారం కలెక్టర్ తమీమ్ అన్సారియా, అధికారులతో కలిసి ఆయన బీచ్‌ను సందర్శించారు. పర్యాటకులను ఆకట్టుకునేలా తీరం వెంబడి కొబ్బరి, పామాయిల్ చెట్లను నాటించాలని అధికారులు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. 'స్వచ్ఛతాహి సేవ' కార్యక్రమంలో భాగంగా బీచ్‌ను తరుచుగా శుభ్రం చేయిస్తామని కలెక్టర్ తెలియజేశారు.

-విశాలాంధ్ర, శింగరాయకొండ

పౌష్టికాహార లోపం నివారిద్దాం ఆరోగ్యమైన సమాజాన్ని నిర్మిద్దాం 4 లో..

• నవంబర్‌లోపు అర్హులందరికీ పింఛన్లు

బాపట్ల చీమకుర్తిలోని ఆర్ఎల్ పురంలో 33/11 కేవీ విద్యుత్తు సబ్ స్టేషన్‌ను ప్రారంభిస్తున్న మంత్రి గొట్టిపాటి రవికుమార్

2 లో

పదవులు అక్కర్లా సేవకోసమే

జనసేనలోకి బాలినేని, కంది రవిశంకర్

- పవన్ కళ్యాణ్ సమక్షంలో పార్టీలో చేరిక
- ఒంగోలులో కంది రవిశంకర్ అభిమానుల భారీ ర్యాలీ

పవన్ కళ్యాణ్‌తో బాలినేని

పవన్ కళ్యాణ్‌తో రవిశంకర్, అతని కుమారులు

విశాలాంధ్ర -ఒంగోలు : పదవుల కోసం కాదు సేవ కోసమే జనసేన పార్టీలోకి చేరుతున్నట్లు మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి, ప్రముఖ పారిశ్రామికవేత్త కంది రవిశంకర్‌లు తెలిపారు. మంగళగిరిలోని కేంద్ర జనసేన పార్టీ కార్యాలయంలో జనసేన పార్టీ అధినేత, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ వీరికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. వీరితో పాటుగా జగ్గయ్యపేట మాజీ ఎమ్మెల్యే సామినేని ఉదయభాను, పొన్నూరు మాజీ ఎమ్మెల్యే కిలాడి రోశయ్య జనసేన పార్టీలోకి గురువారం చేరారు. కంది రవిశంకర్ అభిమానులు ఒంగోలు నగరంలో భారీ ర్యాలీ నిర్వహించారు. మరోవైపు ఐదు సార్లు ఎమ్మెల్యేగా, రెండుసార్లు రాష్ట్రమంత్రిగా పనిచేసిన బాలినేని శ్రీనివాసరెడ్డి జనసేన పార్టీలోకి రావడంతో పార్టీ బలం పుంజుకుంటుందని జిల్లా జనసేన వర్గాలు పేర్కొంటున్నాయి. బాలినేనిపై అవినీతి ఆరోపణలు ఉన్నప్పటికీ, తనపై ఎంక్వయిరీ వేయాలని బాలినేని ఈపాటికి రాష్ట్ర ప్రభుత్వాన్ని పదేపదే కోరారు. దీంతో ఎక్కువ విమర్శలకు తావు లేకుండా బాలినేని జనసేనకి చేరారు. ఇప్పటివరకు ప్రత్యక్ష రాజకీయాలలో ఇటువంటి చురుకైన పాత్ర లేని కంది రవిశంకర్ జనసేన పార్టీలోకి చేరేందుకు నిర్ణయం తీసుకున్నప్పటి నుండి జిల్లా రాజకీయాలలో ఆయన పేరు మారుమోగుతోంది. ఒంగోలు నగరంలో రవి ప్రియ మాల్, టీవీఎస్ షో రూమ్, నాగులపాడు మండలంలోని చదలవాడ వద్ద శాతూరు వాటిక విల్లాస్ నిర్మాణం వ్యాపారం ఉంది. బాలినేని, కందిరవి శంకర్ రాకతో జిల్లాలోని జనసేన పార్టీ కార్యకర్తల్లో ఉత్సాహం నెలకొంది. రవిశంకర్ పార్టీలోకి చేరకముందే జనసేన పార్టీ నాయకులతో కార్యకర్తలతో సత్సంబంధాలు కొనసాగిస్తున్నారు.

ఒంగోలులో భారీ ర్యాలీ

జనసేన పార్టీలోకి చేరే సందర్భంగా కందిరవిశంకర్ ఒంగోలులో భారీ ర్యాలీ నిర్వహించారు. రవి ప్రియ మాల్ వద్ద గజమాలతో జనసేన పార్టీ కార్యకర్తలు రవిశంకర్‌కు భారీగా స్వాగతం పలికారు. ర్యాలీ రవి ప్రియ మాల్ నుండి గుంటూరు రోడ్డు గుండా అద్దంకి బస్టాండ్ సెంటర్, బాపూజీ మార్కెట్ కాంప్లెక్స్ సెంటర్, పాత మార్కెట్ సెంటర్, కొత్తపట్నం బస్టాండ్, చర్చి సెంటర్, కలెక్టరేట్ మీదుగా నెల్లూరు బస్టాండ్, మినీ స్టేడియం వరకు చేరుకొని, తిరిగి అక్కడ నుండి కలెక్టరేట్ మీదుగా ర్యాలీలో జనసేన పార్టీ శ్రేణులు విరివిగా పాల్గొన్నాయి.

నూకసానికి పలువురు శుభాకాంక్షలు

విశాలాంధ్ర-ఒంగోలు : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ బోర్డ్" చైర్మన్ గా నియమితులైన ప్రకాశం జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మరియు జిల్లా ప్రజా పరిషత్ మాజీ చైర్మన్ డాక్టర్ నూకసాని బాలాజీని కలిసి శుభాకాంక్షలు పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తెలిపారు ప్రకాశం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రకటించిన కార్పొరేషన్ చైర్మన్లలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ బోర్డు చైర్మన్‌గా అవకాశం లభించిన ప్రకాశం జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు డాక్టర్ నూకసాని బాలాజీని కలిసి ప్రకాశం జిల్లా ఎనిమిది నియోజకవర్గాల నుండి వచ్చిన పార్టీ నాయకులు కార్య కర్తలు అభిమానులు శుభాకాంక్షలు తెలిపారు. ఏపీ టూరిజం కార్పొరేషన్ బోర్డ్ చైర్మన్ గా అవకాశం కల్పించినందుకు గౌరవ ముఖ్యమంత్రివర్యులు తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడుకి నూకసాని బాలాజీ కృతజ్ఞతలు తెలియజేశారు.

'ఇది మంచి ప్రభుత్వం'లో దామచర్ల

విశాలాంధ్ర-ఒంగోలు : ఒంగోలు కేంద్రములో రాష్ట్రములో ఎన్డీయే కూటమి ప్రభుత్వాలు 100రోజులు పూర్తి చేసుకున్న సందర్భముగా 30వ డివిజన్‌లో నత్తల కనకరావు ఏర్పాటు చేసిన ఇది మంచి ప్రభుత్వము కార్యక్రమములో ఒంగోలు శాసన సభ్యులు దామచర్ల జనార్దనరావు ముఖ్య అతిథిగా హాజరైన సభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా దామచర్ల మాట్లాడుతూ కేవలం 100 రోజులలో రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకుపోతుందన్నారు.

నేటి నుంచి పామూరులో సీపీఐ జిల్లాస్థాయి వర్క్ షాప్

విశాలాంధ్ర-కొనకనమిట్ల : నేటి నుంచి ఈ నెల 28, 29 వరకు పామూరులో సిపిఐ జిల్లా స్థాయి వర్క్ షాపు జరుగుతుందని మండల సిపిఐ కార్యదర్శి కె కోటేశ్వరరావు సిపిఐ నాయకులు పివి కొండయ్యలు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణ తరగతులకు హాజరైరే సభ్యులు మూడు రోజులు పాటు అక్కడ ఉండే విధంగా సిద్ధపడి రావాలని కోరారు.

విభిన్న ప్రతిభావంతులపై ప్రత్యేక శ్రద్ధ

రాష్ట్ర మంత్రి స్వామి

విశాలాంధ్ర-ఒంగోలు : విభిన్న ప్రతిభావంతుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకొని అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నదని రాష్ట్ర సాంఘిక సంక్షేమ, విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ మంత్రి డా. డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి పేర్కొన్నారు. గురువారం సాయంత్రం ఒంగోలులోని ప్రభుత్వ బధిరుల ఆశ్రమ పాఠశాలలో నిర్వహించిన బధిరుల సంకేత భాషా దినోత్సవ వేడుకలు మరియు జాతీయ దివ్యాంగుల ఆర్థిక అభివృద్ధి సంస్థ ద్వారా ఎంపిక చేయబడిన లబ్దిదారులకు చెక్కులు పంపిణీ కార్యక్రమంలో మంత్రి డా. శ్రీ బాల వీరాంజనేయ స్వామి, జిల్లా కలెక్టర్ ఎ. తమీమ్ అన్సారియా పాల్గొన్నారు. ఈ సందర్భంగా విభిన్న ప్రతిభావంతుల సంక్షేమానికి ఎనలేని కృషి చేసిన హెలెన్ కెల్లర్ చిత్ర పటానికి పూల మాల వేసి ఘనంగా నివాళులు అర్పించడంతో పాటు జ్యోతి ప్రజ్వలన గావించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లాలోని 50 మంది విభిన్న ప్రతిభావంతులకు ఎన్.హెచ్.ఎఫ్.డి.సి కింద కోటి 46 లక్షల 50 వేల రూపాయల విలువ చెక్కులను మంత్రి అందచేసారు.

నవంబర్‌లోపు అర్హులందరికీ పింఛన్లు

'ఇది మంచి ప్రభుత్వం'లో పాల్గొన్న మంత్రి గొట్టిపాటి రవి కుమార్

విశాలాంధ్ర-చీమకుర్తి : నవంబర్ లోపు అర్హులందరికీ పింఛన్ అందించే దిశగా చంద్రబాబు నాయుడు సమాలోచనలు చేస్తున్నారని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ అన్నారు. జగన్ మోహన్ రెడ్డి రూ. వెయ్యి పింఛన్ పెంచేందుకు ఐదేళ్లు పట్టిందని, అదే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే చంద్రబాబు నాయుడు రూ.వెయ్యి పెంచి స్వయంగా పంపిణీ చేశారని తెలిపారు. సంక్షేమం, అభివృద్ధి కూటమి ప్రభుత్వానికి రెండు కళ్లు లాంటివని మంత్రి పేర్కొన్నారు. దీపావళి నాటికి రాష్ట్ర వ్యాప్తంగా దీపం పథకాన్ని అందుబాటులోకి తీసుకుని వచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు చెప్పారు. ఈ పథకం కింది మహిళలకు మూడు గ్యాస్ సిలీండర్లు ఉచితంగా ఇస్తామని ప్రకటించారు. ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా చీమకుర్తి మండలంలోని ఆర్ఎల్ పురం పంచాయతీలో మంత్రి గొట్టిపాటి రవి కుమార్, సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్. విజయ్ కుమార్ పర్యటించారు. ఆర్ఎల్ పురంలోని కొత్తగా నిర్మించిన 33/11 కేవీ విద్యుత్తు సబ్ స్టేషన్ ను స్థానిక ఎమ్మెల్యేతో కలిసి ప్రారంభించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ చీమకుర్తి పరిసర ప్రాంతాల్లో ఇండస్ట్రీ లో విద్యుత్ కొరత సమస్యని త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. గ్రామాల్లో సైతం నాణ్యమైన విద్యుత్ అందించే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని మంత్రి తెలిపారు. ఇందులో భాగంగానే కొత్త విద్యుత్ సబ్ స్టేషన్లను ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు పేర్కొన్నారు. వంద రోజుల్లో ఏం చేశామని ప్రతిపక్ష నాయకులు ప్రశ్నిస్తున్నారు... వంద రోజుల్లో నిరుద్యోగులకు మెగా డీఎస్సీ ప్రకటించామని మంత్రి గొట్టిపాటి రవి కుమార్ తెలిపారు. ఈ వంద రోజుల్లోనే రైతుల మెడకు ఉరి దాడులా ఉన్న ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ ను రద్దు చేశామని పేర్కొన్నారు. పింఛన్ ను వెయ్యి రూపాయిలు పెంచామని చెప్పారు. దీనితో పాటు అనుకోకుండా ముంచెత్తిన వరదలను కూడా సమర్థవంతంగా ఎదుర్కొనకలిగామని వివరించారు. గత ప్రభుత్వం నిర్వాకం కారణంగానే వరదలు ముంచెత్తినట్లు మంత్రి గొట్టిపాటి విమర్శించారు. గడిచిన ఐదేళ్లలో ఏ ప్రాజెక్టుకు సరిపడా నిధులు కేటాయించిన దాఖలాలు లేవని తెలిపారు. స్థాని కంగా ఉన్న గుండ్లకమ్మ ప్రాజెక్టును మెయింటెనెన్స్ పనులు చేయకవడం కారణంగానే గేట్లు కొట్టుకుపోయాయని మండిపడ్డారు. మనం అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే గుండ్లకమ్మకు నిధులు విడుదల చేసినట్లు మంత్రి తెలిపారు.

అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం

నేర సమీక్షలో జిల్లా ఎస్పీ తుషార్

విశాలాంధ్ర - బాపట్ల : అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై ఉక్కుపాదం మోపాలని జిల్లా ఎస్పీ తుషార్ డూడి పోలీస్ అధికారులను ఆదేశించారు. స్థానిక ఎస్పీ క్యాంప్ కార్యాలయ సమావేశ హాలులో గురువారం నేర సమీక్షాసమావేశం నిర్వహించారు. గంజాయి, ఎస్సీ ఎస్టీ, మిస్సింగ్ కేసులు, మహిళా సంబంధిత నేరాలు ఫోక్సో కేసులు, దొంగతనాలు, తీవ్రమైన నేరాలు, రౌడీ షీటర్లు పాత నేరస్తులపై నిఘా, పెండింగ్ లో ఉన్న నాన్ బెయిలబుల్ వారెంట్ లు, రోడ్డు ప్రమాదాలు, సీసీ కెమెరాల ఏర్పాటు సంబంధిత అంశాల సమీక్షించారు. నేరాల కట్టడికి తీసుకుంటున్న చర్యలు, వీక్లీ ప్లాన్ ఆఫ్ యాక్షన్ లో భాగంగా జిల్లా పోలీస్ అధికారులు నిర్వహిస్తున్న కార్యక్రమాలు అడిగి తెలుసుకున్నారు. గతవారం జరిగిన లోక్ అదాలత్ లో రాజీమార్గం ద్వారా ఎక్కువ కేసులు పరిష్కరించిన బాపట్ల పట్టణ సీఐ జానీ అహ్మద్ కి, నేరాలు ఛేదించడంలో విశేష కృషి చేసిన ఇతర పోలీస్ అధికారులు,సిబ్బందిని ఎస్పీ అభినందించి ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో గంజాయి అక్రమ రవాణా విక్రయాలు జరగకుండా అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. గంజాయి సంబంధిత కేసులలో గతంలో అరెస్ట్ చేసిన ముద్దాయిలపై నిఘా ఉంచాలన్నారు. పగలు రాత్రివేళ గస్తీలు ముమ్మరం నిర్వహించి దొంగతనాలు నేరాలను కట్టడి చేయాలన్నారు. నేర సమీక్ష సమావేశంలో అడిషనల్ ఎస్పీ టి.పి.విఠలేశ్వర్, రేపల్లె డీఎస్పి టి.మురళీకృష్ణ,బాపట్ల డీఎస్పి జి.రామాంజనేయులు, సీసీఎస్ డీఎస్పి పి.జగదీష్ నాయక్,ఏఆర్ డీఎస్పి ఎస్.చంద్రమోహన్, ఎస్.బి సిఐ జి.నారాయణ, డిసిఆర్బి సీఐ బాల మురళీకృష్ణ పాల్గొన్నారు.

అధికార లాంఛనాలతో మాగుంట పార్వతమ్మ అంత్యక్రియలు

విశాలాంధ్ర బ్యూరో-ఒంగోలు : మాజీ పార్లమెంట్ సభ్యురాలు మాగుంట పార్వతమ్మ అంత్యక్రియలు గురువారం నెల్లూరులో ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు ముగిశాయి. రాష్ట్ర ప్రభుత్వం తరపున విద్యుత్ శాఖా మంత్రి గొట్టిపాటి రవికుమార్ కార్యక్రమంలో పాల్గొని నివాళులు అర్పించారు. బుధవారం ఉదయం మాగుంట పార్వతమ్మ చనిపోయిన విషయం విదితమే ప్రజల సందర్శనార్థం గురువారం సాయంత్రం వరకు నెల్లూరులోని పార్వతమ్మ స్వగృహం నందు మృతదేహాన్ని ఉంచారు. మాగుంట పార్వతమ్మ మృతి ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో విషాద చాయలు అలుముకున్నాయి. తెలుగుదేశం, జనసేన ఇతర రాజకీయ పార్టీలకు అతీతంగా ఎమ్మెల్యేలు, ఎంపీలు, మాజీ ఎమ్మెల్యేలు ఇతర నాయకులతో పాటు అధికారులు సైతం మాగుంట పార్వతమ్మ భౌతిక కాయానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తూ అనంతరం ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసరెడ్డిని ఓదార్చారు. గురువారం ఉదయం నుంచి జిల్లాకు చెందిన తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, కనిగిరి ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కరణం బలరాంకృష్ణమూర్తి, దర్శి టీడీపీ ఇన్‌చార్జి గొట్టిపాటి లక్ష్మి, గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి, యర్రగొండపాలెం ఇన్‌ఛార్జి ఎరిక్షన్‌బాబు, ఒంగోలు మేయర్ గంగాడ సుజాత, ఏపీయూడబ్ల్యుజే రాష్ట్ర అధ్యక్షులు ఐవీ సుబ్బారావు, మాజీ మంత్రి పనబాక లక్ష్మి, మాజీ టీటీడీ బోర్డు చైర్మన్ బాపిరాజు, మాజీ రాష్ట్ర ముఖ్యమంత్రి నెదురుమల్లి జనార్దన్‌రెడ్డి ఆయన కుమారుడు రాంకుమార్‌రెడ్డి, మాజీ శాసనసభ్యులు వివేకానంద రెడ్డి కుమారుడు చెంచు సుబ్బారెడ్డి, ఉదయగిరి,మ్మెల్యే కకర్ల సురేష్‌తో పాటు పలువురు టీడీపీ ముఖ్య నేతలు అంతిమయాత్రలో పాల్గొన్నారు. నెల్లూరులోని మాగుంట పార్వతమ్మ నివాసం నుంచి స్మశాన వాటిక వరకు ర్యాలీగా వెళ్లారు. అక్కడ పోలీసులు ప్రభుత్వ లాంఛనాలతో గాలిలో రెండు కాల్పులు జరిపి పార్వతమ్మ అంత్యక్రియలను ముగించారు.

ఐఐటి, నీట్ పరీక్షలకు వచ్చేనెల నుంచి శిక్షణ

మంత్రి డోల బాలవీరాంజనేయ స్వామి

విశాలాంధ్ర-సింగరాయకొండ : మండల కేంద్రమైన శింగరాయ కొండలోని డాక్టర్.బి.ఆర్.అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాలలో ఐఐటి, నీట్ శిక్షణ కార్యక్రమాలను వచ్చే నెల నుండి ప్రారంభిస్తామని రాష్ట్ర సాంఘిక సంక్షేమ, వయోవృద్ధులు, దివ్యాంగుల సంక్షేమ, సచివాలయాల శాఖా మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి చెప్పారు. ఏ.పి.ఎస్.డబ్ల్యు, ఆర్.ఐ.ఈ.ఎస్. కార్యదర్శి వి.ప్రసన్న వెంకటేష్, జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియాతో కలిసి గురువారం ఈ పాఠశాలను ఆయన సందర్శించారు. తొలుత ఏ.పి.ఎస్.డబ్ల్యు ఆర్.ఐ.ఈ.ఎస్. జిల్లా కో-ఆర్డినేటర్ శ్రీమతి. జయ, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి లక్ష్మానాయక్, ఏ.పి.ఈ.డబ్ల్యు.ఐ.డి.సి. ఈ.ఈ. భాస్కరబాబు, డి.ఈ. జగన్, ప్రిన్సిపాల్ కె.రమాదేవితో సమీక్ష నిర్వహించారు. ఈ పాఠశాలలోని వసతులు, సమస్యలపై మంత్రి ఆరా తీశారు. కాగా పాఠశాలకు అవసరమైన ఫ్యాన్లు, ట్యూబ్ లైట్లు సమకూరుస్తామని ప్రసన్నకుమార్ తెలిపారు. పాఠశాలలో అవసరమైన ఇద్దరు వంట మనుషులను తాత్కాలిక ప్రాతిపదికన నియమించు కోవాలని ఈ సందర్భంగా ప్రిన్సిపాల్కు సూచించారు. పారిశుద్ధ్య పనులకు అవసరమైన మిషన్లను కొనుగోలు చేయడానికి టెండర్లు పిలిచినట్లు ఆయన తెలిపారు. ఐఐటి, నీట్ శిక్షణకు అవసరమైన తరగతి గదుల లభ్యతపై ఆయన వివరాలు అడిగి తెలుసుకున్నారు. దీనిపై ప్రిన్సిపాల్ స్పందిస్తూ ప్రస్తుతం 10 గదులు ఖాళీగా ఉన్నాయనీ, వీటిని వినియోగించు కోవచ్చు నని చెప్పారు. అనంతరం ప్రాంగణం మొత్తం వారు కలియదిరిగి వివిధ భవనాలను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఈ సంవత్సరం 80 మందికి ఐఐటి, నీట్ శిక్షణ ఇస్తామన్నారు. వచ్చే విద్యా సంవత్సరం నుండి 160 మందికి కోచింగ్ ఇస్తామని చెప్పారు. ఇందుకోసం ప్రస్తుత భవనాలనే వాడుకుంటామన్నారు. అవసరమైన అదనపు టాయిలెట్లను నిర్మిస్తామని తెలిపారు. వచ్చే విద్యా సంవత్సరం నుండి ఈ ప్రాంగణంలో డిగ్రీ కాలేజీని ఏర్పాటుచేస్తామని మంత్రి చెప్పారు. రాష్ట్రంలోనే మొట్ట మొదటి సారిగా శింగరాయకొండలోనే దీనిని పైలెట్ ప్రాజెక్టు ఏర్పాటు చేయడానికి గత నెలలో జరిగిన బోర్డ్ ఆఫ్ గవర్నెన్స్ సమావేశంలో ఆమోదం లభించిందన్నారు.

పట్టుదలతో ఉన్నత శిఖరాలను అవరోధించాలి

వీసీపల్లి ఎస్ఐ జి.కోటయ్య

విశాలాంధ్ర-వీసీపల్లి : విద్యార్థినీ విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలను అవరోధించాలని పిసిపల్లి ఎస్సై జి కోటయ్య అన్నారు. జిల్లా ఎస్పీ ఆర్ దామోదర్ ఆదేశాల మేరకు గురువారం మండలంలోని పీసీపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థినీ విద్యార్థులకు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి బాలబాలికలకు ఈవిటీజింగ్పై అవగాహన కల్పించారు. ఎస్ఐ మాట్లాడుతూ ఆడపిల్లలు ప్రస్తుత సమాజంలో జరుగుతున్న పరిణామాలపై అవగాహన కలిగి ఉండాలని సామాజిక వ్యవస్థపై బాలికలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత తల్లిదండ్రులదేనని ప్రస్తుతం సమాజంలో జరుగుతున్న నేరాలను వివరిస్తూ వాటికి దూరంగా ఉండాలని హెచ్చరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయిని ఉపాధ్యాయతర సిబ్బంది పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన

విశాలాంధ్ర-మర్రిపూడి : స్థానిక మండల కేంద్రం వద్ద ఈనెల 27తేదిన శుక్రవారం ఉదయం 11 గంటలకు మండల ప్రజా పరిషత్ కార్యాలయం నందు మండల వ్యవసాయ అధికారి సీ. హెచ్. వెంకటేష్ ఆధ్వర్యంలో సమాచార హక్కు చట్టం -2005 పైన అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని వ్యవసాయ అధికారి సి. హెచ్. వెంకటేష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి మండల స్థాయి అధికారులు, సిబ్బంది, రైతుసోదరులు అందరు పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వ్యవసాయ అధికారి వెంకటేష్ కోరారు.

అంకయ్య కుటుంబానికి రూ.10వేల ఆర్థిక సాయం

విశాలాంధ్ర- వెలిగండ్ల: మండలంలోని గన్నవరం పంచాయతీలో గండ్లో పల్లి గ్రామానికి చెందిన టిడిపి నాయకులు మల్లెల అంకయ్య మృతితో ఆ కుటుంబానికి తీరని లోటు ఏర్పడిందని అందుకుగాను ఆయన కుమారుడు మల్లెల దేవిడ్కి జార్జ్ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు దేవ సహాయం, ఆయన సతీమణి మాజీ వైస్ ఎంపీపీ, గన్నవరం ఎంపీటీసీ తాతపూడి మేరీ పుష్ప పదివేల రూపాయలను ఆర్థిక సహాయాన్ని బుధవారం అందజేశారు.

నేడు సమాచార హక్కు చట్టంపై అవగాహన సదస్సు

విశాలాంధ్ర-కురిచేడు : సమాచార హక్కు చట్టం 2005 అవగాహన సదస్సు స్థానిక మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో నేడు మధ్యాహ్నం మూడు గంటలకు జరుగుతుందని మండల వ్యవసాయ అధికారి మధుబాబు గురువారం పత్రిక ప్రకటన ద్వారా తెలియజేశారు. ముఖ్యఅతిథిగా స్పెషల్ కమిషనర్ ఆఫ్ అగ్రికల్చర్ గుంటూరు ఉత్తర్వులు మేరకు సమాచార హక్కు చట్టంపై అవగాహన జరుగుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమానికి ప్రజా ప్రతినిధులు, సామాన్యులు హాజరుకావాలన్నారు.

సచివాలయాల ఆకస్మిక తనిఖీ

విశాలాంధ్ర-వెలిగండ్ల : మండలంలోని పందువ నాగులవరం, గుడిపాటిపల్లి, రాళ్లపల్లి సచివాలయాలను ఇన్చార్జి ఎంపీడీవో షేక్ మహబూబ్ బాషా, ఈవోపీఆర్డి తాతపూడి సుకుమార్ గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ క్రమంలో పలు రికార్డులను పరిశీలించి, సచివాలయ ఉద్యోగుల హాజరు దస్త్రాలను పరిశీలించారు. ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారం అర్హులకు సంక్షేమ పథకాలు అందేలా చూడాలని, ప్రజా సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. సచివాలయ పరిధిలో రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజలకు అమలు చేస్తున్న సంక్షేమ పథకాల పనితీరు గురించి అడిగి తెలుసుకున్నారు సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించాలని పాటించని సిబ్బందిపై శాఖపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం అంగన్వాడి ఆధ్వర్యంలో గర్భిణీలకు సీమంతాలు మండలంలోని కండ్రిక అంగన్వాడి సెంటర్ నందు పోషణ మాసాన్ని పురస్కరించుకొని అంగన్వాడీ కార్యకర్తల ఆధ్వర్యంలో గర్భిణులకు సామూహిక సీమంతాలు కార్యక్రమం నిర్వహించారు కండ్రిక అంగన్వాడీ కార్యకర్త ముక్కు శ్రీలక్ష్మి గర్భిణీలకు పూలు పండ్లు అందజేసి గాజులు తొడిగి సామూహిక సీమంతాలు నిర్వహించారు. మండల పరిషత్ అభివృద్ధి అధికారి షేక్ మహబూబ్ బాషా, ఈవోపీఆర్డి తాతపూడి సుకుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గర్భిణీలు పోషక ఆహారాన్ని తీసుకుంటే పుట్టబోయే పిల్లలు ఆరోగ్యంగా ఉంటారని సూచించారు. అనంతరం గర్భిణీలను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సిడిపిఓ, సూపర్వైజర్లు ఆశీర్వదించారు.

పౌష్టికాహార మాసోత్సవాలు

విశాలాంధ్ర-పెద్దదోర్నాల : సెంటర్ ఫర్ వరల్డ్ సోలిడారిటీ (సిడబ్ల్యుఎస్) సంస్థ ఆధ్వర్యంలో పౌష్టికాహార మాసోత్సవాలు దోర్నాల మండలం, నల్లగుంట్ల పంచాయితీ, నల్లగుంట్ల బోడు అంగన్వాడీ కేంద్రం నందు నిర్వహించగా ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎం.పద్మావతి, సిడిపిఒ హాజరయ్యారు. గర్భిణీలు, బాలింతలు, చిన్నపిల్లలు పాల్గొనగా సీడీపీఓ యం పద్మావతి మేడం గిరిజన మహిళల్లో పోషకాహార లోపం కనిపిస్తుంది కావున గర్భిణీగా ఉన్నప్పటి నుంచే పోషక విలువలు ఉన్నటువంటి ఆహారం తీసుకోవాలని తినే ఆహారం లో ఆకుకూరలు కూరగాయలు తీగజాతి కూరగాయలు క్యారెట్ బీట్రూట్ దుంపలు ముఖ్యంగా అత్యధికమైన పోషకాలు ఉన్నటువంటి మునగ ఆకు మునక్కాయ మంచి ఆరోగ్యాన్ని కలగజేస్తుంది కావున తక్కువ ఖర్చుతో అధిక పోషకాలు ఉన్నటువంటి ఆహారాన్ని తీసుకోవాలని ప్రతీ ఇంటిదగ్గర పెరటి తోటలు పెంచుకోవాలని పెరటి తోటల్లో మునగ బొప్పాయి పెంచు కోవాలని సూచించడం జరిగింది.

28,29 తేదీల్లో జాతోతు హుస్సేన్ జిల్లాలో పర్యటన

- జిల్లా గిరిజన సంక్షేమాధి కారి జగదీశ్వరరావు

విశాలాంధ్ర-ఒంగోలు టౌన్ : జాతీయ షెడ్యూల్డ్ తెగల కమిషన్ మెంబర్ జాతోతు హుస్సేన్ రెండు రోజులు పాటు జిల్లాలో పర్యటించనున్నట్లు జిల్లా గిరిజన సంక్షేమాధి కారి జగదీశ్వరరావు తెలిపారు. ఈ నెల 28, 29 తేదీల్లో రెండు రోజుల పాటు పర్యటనలో భాగముగా 28 న ఉదయం 09.00 గంటలకు చీమకుర్తి లోని గిరిజన గురుకుల పాఠశాల ను సందర్శించెదరు, తదుపరి కొప్పోలు మరియు చింతల మధ్య లో గల నక్కల కాలనీ ని సందర్శించెదరని, పిదప కొత్తపట్నం మండలం లోని రంగాయపాలెం యానాది కాలనీలోని తుఫాన్ షెల్టర్ నందు ముఖా ముఖి కార్యక్రమములో గిరిజనుల సమస్యల పై చర్చించడం జరుగుతుందని తెలిపారు. ఆ సమయములో అర్జీ లను సమర్పించవచ్చని తెలిపారు. మధ్యాహ్నం 03.00 గంటలకు కలెక్టర్ కాన్ఫరెన్స్ హాల్, ఒంగోలు లో మెంబర్ మరియు కలెక్టరు, జిల్లా అధికారులతో సమీక్షా సమావేశము జరుగునని తెలిపారు. 29 న ఆదివారం ఉదయం 10.00 గంటలకు అంబేద్కర్ భవనం, ఒంగోలు నందు అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం, ప్రకాశం జిల్లా వారి సర్వ సభ్య సమావేశం జరుగును. సదరు సమావేశములో జాతీయ షెడ్యూల్డ్ తెగల కమిషన్ మెంబర్ జాతోతు హుస్సేన్ పాల్గొనెదరని తెలిపారు. జిల్లాలోని గిరిజన ప్రజలు మరియు గిరిజన సంఘాల నాయకులు ఈ సమావేశము నకు హాజరై వారి విన్నపాలను తెలియ చేసుకొనవచ్చుని తెలిపారు.

జిల్లా స్థాయి వర్క్ షాప్ను జయప్రదం చేయండి : సీపీఐ

విశాలాంధ్ర త్రిపురాంతకం : ప్రకాశం జిల్లా కనిగిరిలో జరుగుతున్న ప్రకాశం జిల్లా స్థాయి వర్క్ షాప్ను జయప్రదం చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు డి శ్రీనివాస్ అన్నారు.త్రిపురాంతకం మండలంలోని స్థానిక సిపిఐ కార్యాలయంలో సిపిఐ మండల కార్యదర్శి బాణాల రామయ్య ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్ మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు 27 న సిపిఐ నాయకులకు కార్యకర్తలకు శిక్షణ తరగతులు నిర్వహించడం జరుగుతుంది.ఈ శిక్షణ తరగతులు రాష్ట్ర నాయకులు పాల్గొంటారు. విశిష్ట అనుభవం కలిగిన అధ్యాపకులచే శిక్షణ, పాఠ్య అంశాల బోధన నిర్వహించడం జరుగుతుంది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల పరిపాలనపై జరుగుతున్న వైఫల్యాలను వివరించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి సిపిఐ నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపు నిచ్చారు. ఈకార్యక్రమంలో సిపిఐ మండల సహాయ కార్యదర్శి ఖాసీం, సిపిఐ నాయకులు పాల్గొన్నారు.

మాగుంట పార్వతమ్మ మృతి బాధాకరం

డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ

విశాలాంధ్ర-దర్శి : ఒంగోలు మాజీ పార్లమెంట్ సభ్యులు మాగుంట పార్వతమ్మ భౌతిక కాయానికి రాష్ట్ర విద్యుత్ శాఖ మాత్యులు గొట్టిపాటి రవి కుమార్ దర్శి నియోజకవర్గ టిడిపి ఇంచార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ కడియాల లలిత్ సాగర్, మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి, సంతనూతలపాడు శాసనసభ్యులు బి.ఎన్. విజయకుమార్, కనిగిరి శాసనసభ్యులు ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, మాజీ పార్లమెంట్ సభ్యులు పనబాక లక్ష్మీ తదితర నాయకులు, దర్శి నియోజకవర్గం లోని వివిధ హోదాల్లో ఉన్న టిడిపి నాయకులు ఉన్నారు. డాక్టర్ లక్ష్మీ మాట్లాడుతూ మాగుంట పార్వతమ్మ ప్రకాశం జిల్లాలో విశేష సేవలందించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో విసి రెడ్డి, మనం రమేష్ పాల్గొన్నారు.

మురుగు శుభ్రం చేయించిన ఈఓఆర్డీ

విశాలాంధ్ర కథనానికి స్పందన

విశాలాంధ్ర-వెలిగండ్ల : మండలంలోని కంకణంపాడు పంచాయతీ నందు గల అగ్రహారం గ్రామంలో సోమవారం కురిసిన వర్షానికి రోడ్డకు ఇరువైపులా సైడ్ కాలవలో లేకపోవడంతో వర్షపు నీరు రోడ్డమీద నిలిచి ఉండటంతో మంగళవారం రోడ్ లో మరుగునీరుతో ప్రజలకు అవస్థలు విద్యుత్ ఘాతుకముతో ప్రజలకు ఇబ్బందులు అనే కథనానికి మండల పరిషత్ అధికారులు ఈ ఓ ఆర్ డి తాతపూడి సుకుమార్ తన సిబ్బందితో గురువారం అగ్రహారం గ్రామాన్ని సందర్శించి జెసిబి తో మురుగును శుభ్రపరిచారు అనంతరం సైడ్ కాలవల కొరకు అంచనా వ్యయం వేశారు విక్రమంలో గ్రామ ప్రజలు విశాలాంధ్ర కథనానికి ధన్యవాదాలు తెలిపారు.

హాకీ జట్టుకు ఎంపికైన విద్యార్థులు

విశాలాంధ్ర-ముండ్లమూరు : మండలంలోని ఉమామహేశ్వరపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి హాకీ జట్టుకు ఎంపికైనట్లు ఫిజికల్ డైరెక్టర్ తిరుపతి స్వామి తెలిపారు. మైనంపాడు లో గురువారం జరిగిన జిల్లాస్థాయి హాకీ పోటీలలో ప్రతిభ చాటి రాష్ట్రస్థాయి జట్టుకు ఎంపికయ్యారు. ఎంపికైన వారిలో రేణుక, భావన, కీర్తన, దీపిక, ప్రణతి, అఖిల్ ఎంపికైన వారిలో ఉన్నారు. ఎంపికైన వారిని ప్రధానోపాధ్యాయులు బాలిశెట్టి శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, విజయ్, సురేంద్ర, మస్తాన్, శ్రీధర్, నాగేశ్వరరావు, స్నేహలత, పద్మావతి, ఏడుకొండలు, శ్రీనివాసరావు, అంజనీ కుమారి, శివ ప్రసాద్, బాబురావులు అభినందించారు.

చంద్రబాబుని కలిసిన బత్తులు శ్రీనాథ్



విశాలాంధ్ర-దర్శి : ముఖ్యమంత్రి నారాచంద్ర బాబుని ఒంగోలు పార్లమెంట్ తెలుగు యువత మీడియా కోఆర్డినేటర్, శివాజీ నగర్ తెలుగుదేశం పార్టీ నాయకులు, యూనిట్ ఇన్చార్జి బత్తుల శ్రీనాథ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును సచివాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. దర్శి నియోజకవర్గంలో టిడిపి ఇన్చార్జి గొట్టిపాటి లక్ష్మి ఆధ్వర్యంలో జరుగుతున్న పలు అభివృద్ధి కార్యక్రమాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు వివరించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుని కలవడం సంతోషంగా ఉందని, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, ఐటి మినిస్టర్ లోకేష్ బాబుల ఆధ్వర్యంలో ఆంధ్ర రాష్ట్రం అభివృద్ధి పదంలో దూసుకుపోవడం ఖాయం అన్నారు.

వాహనదారులకు ధ్రువీకరణ పత్రాలు ఉండాలి

విశాలాంధ్ర-హనుమంతునిపాడు : వాహనదారులు సరైన ధ్రువీకరణ పత్రాలు కలిగి ఉండాలని హెచ్ఎంపాడు ఎస్సై కే.మాధవరావు ఎస్సై మాట్లాడుతూ జిల్లా ఎస్పీ ఏ ఆర్ దామోదర్ ఆదేశాల మేరకు గురువారం విజిబుల్ పోలిసింగ్ లో భాగంగా హాజీపురం క్రాస్ రోడ్డు వద్ద వాహనాలను ఎస్సై తనిఖీలు నిర్వహించారు. అలానే వాహనాలకు సంబంధించి పత్రాలను పరిశీలించారు. సరైన ధ్రువపత్రాలు లేకుండా నడిపే వాహనాలకు చలానా విధించారు.

సంక్షోభంలోనూ సంక్షేమ అందిస్తున్న ఎన్డీఏ ప్రభుత్వం

టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కోటపాటి

విశాలాంధ్ర-పామూరు : సంక్షోభంలోనూ సంక్షేమం అందించి అభివృద్ధికి రెక్కలు తొడిగి మొదటి 100 రోజుల్లోనే 'ఇది మంచి ప్రభుత్వం' అనిపించుకున్న ఘనత ఎన్ డి ఏ కూటమి ప్రభుత్వానికి దక్కిందని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి కోటపాటి జనార్ధన్ రావు అన్నారు. గురువారం సాయంత్రం మండల కేంద్రమైన పామూరు పట్టణములో నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో స్థానిక నాయకులతో కలిసి జనార్ధన్ రావు ఇంటింటికీ తిరిగి తెలుగుదేశం ప్రభుత్వం అందిస్తున్న పథకాలను వివరించారు. పాల్గొన్న కోటపాటి జనార్ధన్ రావు పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ఇంటి వద్దనే అవ్వాతాతలకు రూ.4వేలు, దివ్యాంగులకు రూ.6 వేలు పెన్షన్ అందజేత,అన్నక్యాంటీన్ లతో లక్షలాది మందికి ఆకలి తీరుస్తున్న ప్రభుత్వంను రాష్ట్ర ప్రజలు అభినందిస్తున్నారు. మెగా డీఎస్సీ తో నిరుద్యోగ యువత భవిష్యత్తుకు భరోసా, రైతు కష్టం తీర్చేందుకు రూ.1674 కోట్ల ధాన్యం కొనుగోలు బకాయిల చెల్లింపు, ఇక మీదట కూడా ప్రజల ఆకాంక్షలకు, అవసరాలకు అనుగుణంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని చెప్పారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు పువ్వాడి వెంకటేశ్వర్లు, టీడీపీ నాయకులు యారవ శ్రీనివాసులు, బిజెపి కనిగిరి నియోజకవర్గ కన్వీనర్ కొండిశెట్టి రమణయ్య, లక్ష్మీ నరసాపురం ఎంపీటీసీ సభ్యులు బొల్లా నరసింహారావు, ఇర్రి కోటిరెడ్డి జనసేన పార్టీ మండల అధ్యక్షులు దర్శి ఏడుకొండలు, బిజెపి మండల పార్టీ అధ్యక్షులు సుబ్బయ్య, ఎంపీటీసీ నాయబ్ రసూల్, తెలుగుదేశం నాయకులు అమీన్ బాబు, గౌస్ బాషా, మాజీ సర్పంచి కావేటి సుబ్బయ్య, కోడిగుడ్లపాడు సర్పంచి కొండబాబు, మన్నం రమణయ్య, ఎలమందల రహీముల్లా , బిజెపి నియోజకవర్గ సోషల్ మీడియా కన్వీనర్ ఉప్పలపాటి హరిబాబు, నారాయణ, విజయకుమార్, దేవరపు మాల్యాద్రి, కావేరి రసూల్ పాల్గొన్నారు.

జీ తెలుగులో సరిగమప సీజన్ -16

ది నెక్స్ట్ సింగింగ్ యూత్ ఐకాన్ గ్రాండ్ లాంచ్

విశాలాంధ్ర -ఒంగోలు: జీ తెలుగు సరిగమప తన సరిగమప సీజన్ -16 ది నెక్స్ట్ సింగింగ్ యూత్ ఐకాన్ ఈ నెల 29న, సాయంత్రం 6 గంటలకు, అక్టోబర్ 6 నుండి ప్రతి ఆదివారం రాత్రి 9 గంటలకు ప్రసారమవుతుందని సంస్థ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగు రాష్ట్రాలతో పాటు ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రతిభావంతులైన గాయకులకు ప్రోత్సహించే లక్ష్యంతో ద్యాన్సింగ్, సింగింగ్ షోలతో మట్టిలో మాణిక్యాలను జీ తెలుగు గుర్తిస్తుందన్నారు. ఇందులో భాగంగానే విజయవంతంగా 15 సీజన్లు పూర్తి చేసుకున్న సింగింగ్ షో 'సరిగమప' కొత్త సీజన్ ప్రారంభం కానుందన్నారు. ఈ సీజన్లో గాయనీ గాయకులు విలేజ్ వోకల్స్, సిటీ క్లాసిక్స్, మెట్రో మెలోడీస్ అనే మూడు జట్లుగా పోటీపడతారన్నారు. ఈ జట్లకు మెంటర్లుగా రేవంత్, రమ్య బెహరా, అనుదీప్ దేవ్ నాయకత్వం వహిస్తారన్నారు. ఈ సీజన్‌కు ఎనర్జిటిక్ యాంకర్ శ్రీముఖి వ్యాఖ్యాతగా వ్యవహరిస్తుండగా, సంగీత దర్శకుడు కోటి, ప్రముఖ గాయని ఎస్పీ శైలజ, పాటల రచయిత కాసర్ల శ్యామ్ న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించనున్నారు. జీ తెలుగు చీఫ్ కంటెంట్ ఆఫీసర్ – అనురాధ గూడూరు మాట్లాడుతూ, "యువ, అసాధారణ ప్రతిభావంతులకు ఎల్లప్పుడూ లాంచ్ ప్యాడ్‌గా ఉన్న జీ తెలుగు సరిగమప సీజన్ 16ను ప్రారంభించడం చాలా సంతోషంగా ఉందన్నారు. ప్రతి సీజన్ మాదిరిగానే ఈ సీజన్లోనూ ప్రతిభావంతులైన గాయనీ గాయకులను ప్రోత్సహించడమే మా లక్ష్యమన్నారు. ఇప్పటికే మనం చూసిన ఎనర్జీ, ప్యాషన్, టాలెంట్ చెప్పుకోదగ్గవన్నారు. తమ కలలను నిజం చేసుకోవడమే కాకుండా లక్షలాది మందికి స్ఫూర్తినిచ్చే ఓ వేదికను అందించడమే మా ఉద్దేశమన్నారు. ఈ సీజన్ ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టు కుంటుందని ఆశిస్తున్నామంటూ ధీమా వ్యక్తం చేశారు.

కురిచేడు పోలీస్‌స్టేషన్‌లో డీఎస్పీ ఆకస్మిక తనిఖీ

విశాలాంధ్ర-కురిచేడు : స్థానిక పోలీస్ స్టేషను దర్శి డిఎస్పి లక్ష్మీనారాయణ గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించి పోలీసులు పనితీరును తెలుసుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక పాత్రికేయులతో డి.ఎస్.పి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ గ్రామాలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా గ్రామస్తులు పోలీసు వారికి సహకరించాలని చిన్న చిన్న సమస్యలు వచ్చినా సర్దుకుని పోవాలని లా అండ్ ఆర్డర్ కు విఘాతం కలిగిస్తే ఎలాంటి ఓవర్నైనా ఉపేక్షించేది లేదని చట్టానికి అందరూ సమానులేనని పేర్కొన్నారు. వినాయక చవితి సందర్భంగా మండలంలో దేకనకొండ గ్రామంలో జరిగిన ఘర్షణ గ్రామానికి మొత్తం చుట్టుకుందని వారందరూ రిమాండ్ లో ఉన్నారని గ్రామాలలో ఇలాంటి సమస్యలు ఉత్పన్నం కాకూడదని అందరూ ఐకమత్యంతో ఉండి గ్రామాలలో సమస్యలు లేకుండా ఉండాలని ఈ సందర్భంగా ఆయన ప్రజలను కోరారు. వీరితోపాటు స్థానిక ఎస్సై ఎం శివ హెడ్ కానిస్టేబుల్ విగ్నేష్ కానిస్టేబుల్ ఉన్నారు.

పౌష్టికాహార లోపం నివారిద్దాం

ఆరోగ్యమైన సమాజాన్ని నిర్మిద్దాం

ఏపీ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు బత్తుల పద్మావతి



విశాలాంధ్ర-ఒంగోలు : కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం మరియు జాతీయ బాలల హక్కుల కమీషన్ ఆదేశాలను అనుసరించి పౌష్టికాహార మాసోత్సవాలు సెప్టెంబర్ 1 నుండి 30 వరకు దేశ వ్యాప్తంగా నిర్వహిస్తున్న నేపథ్యంలో గురువారం కనిగిరి డివిజన్ కేంద్రం కనిగిరిలో కనిగిరి ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం నందు మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ, సీడీపీఓ సరోజినీ ఆధ్వర్యంలో ఆర్ డి ఓ జాన్ ఇర్విన్ అధ్యక్షతన పౌష్టికాహార మాసోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమీషన్ సభ్యులు బత్తుల పద్మావతి మాట్లాడుతూ భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ 2018 వ సంవత్సరములో రాజస్థాన్ లో ప్రతిష్టాత్మకంగా ప్రారంభించారని,అప్పటి నుండి ఇప్పటి వరకు ప్రతి సంవత్సరము సెప్టెంబర్ 1 నుండి 30 వరకు జరుపుకుంటున్న పౌష్టికాహార మాసోత్సవాలు పిల్లల ఎదుగుదలకు ఎంతో దోహదం చేస్తుందని ముఖ్యంగా బాల్యం అంగన్వాడి కేంద్రాల్లో ప్రారంభమవుతుందని, పిల్లలకి చక్కని ప్రవర్తనతో కూడిన నడవడికను నేర్పించాలని అదేవిధంగా పౌష్టికాహారంతో కూడిన ఆహారం అందిస్తూ వారి మానసిక, శారీరక ఎదుగుదలకు దోహదపడాలని చెప్పారు. కార్యక్రమంలో కనిగిరి మున్సిపాలిటీ చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్, ఎమ్ ఈ ఓ సంఘం జిల్లా అధ్యక్షులు రామిరెడ్డి,విద్యాలయం ప్రిన్సిపాల్ సయ్యద్ హసీనా బేగం, మండల ఎమ్ ఈ ఓ నారాయణ రెడ్డి, ఐటిసి ప్రధమ్ కోఆర్డినేటర్ వెంకట లక్ష్మి, గుడ్ హెల్ప్ ఫౌండేషన్ డైరెక్టర్ రమేష్ బాబు, జి ఎస్ అండ్ జి డి కె ఫౌండేషన్ కోఆర్డినేటర్ నవ కుమార్, ఐసిడిఎస్ సూపర్వైజర్లు, అంగన్వాడీలు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం

ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు

విశాలాంధ్ర - బాపట్ల : ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు పేర్కొన్నారు. పట్టణంలోని 20వ వార్డు భీమవారిపాలెంలో జరిగిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 27,768 ఓట్ల మెజారిటీలో గెలిపించిన నా బాపట్ల నియోజకవర్గ ప్రజలకు ప్రత్యేకమైన ధన్యవాదాలు తెలియజేస్తున్నానన్నారు. సంక్షోభంలోనూ సంక్షేమం అందిస్తూ ప్రజల చేత ఇది మంచి ప్రభుత్వం అనిపించుకుందన్నారు. వందరోజులు కాలంలోనే సీఎం చంద్రబాబు నాయుడు పలు పథకాలను అమలు చేశారన్నారు. విజయవాడలో బస్‌లోనే ఉండి వరద బాధితులకు సత్వర సహాయ చర్యలు చేపట్టి రెట్టింపు సహాయాన్ని అందించారని తెలిపారు. వృద్ధులకు అవ్వ తాతలకు పింఛన్లు ఒకేసారి రూ.1000 పెంచి రూ.4 వేలు ఇవ్వడం ఒకటైతే మొదటి నెల ఒక్కొక్కరికీ రూ.7000లు చొప్పున ఒకేరోజు 65.18 లక్షల మందికి ఇంటింటికీ వెళ్లి రూ.4,408 కోట్లు పంపిణీ చేయడం దేశంలోనే తిరుగులేని చరిత్ర సృష్టించారన్నారు. పేదల ఆకలి తీర్చే అన్నా క్యాంటిన్‌ను పునః నిర్మాణం చేసిన ఘనత నారా చంద్రబాబు నాయుడుదేనన్నారు. వైసీపీ ప్రభుత్వం ప్రజలకు నిద్ర లేకుండా చేసిన ల్యాండ్ టైటిలింగ్ యాక్టును రద్దు చేసి ప్రజల ఆస్తులకు భద్రత కల్పించమన్నారు. మెగా డీఎస్సీతో 16,437 ఉపాధ్యాయ పోస్టుల భర్తీని చేపట్టి నిరుద్యోగ యువతకు అండగా నిలబడుతుందన్నారు. వచ్చే దీపావళి నుంచి మహిళలకు ఉచిత గ్యాస్ సిలెండర్ పథకాన్ని అమలు చేయనున్నట్లు చెప్పారు. బాపట్ల నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్.డి.ఓ రవీందర్, మున్సిపాలిటీ స్పెషల్ ఆఫీసర్ శివలీల, కమీషనర్ నిర్మల్ కుమార్, జనసేన సమన్వయకర్త నామన శివన్నారాయణ, పట్టణ అధ్యక్షులు గొలపల శ్రీనివాసరావు, పట్టణ బీజేపి అధ్యక్షులు మామిడి రమేష్, వార్డు తెలుగుదేశంపార్టీ ప్రెసిడెంట్ అందెల మల్లేశ్వరావు, జిట్టా ప్రమీళా రాణీ, కారుమూరి అంజనేష్, చివుకుల దుర్గా ప్రసాద్ శీలం శ్రీనివాస్, కొట్రా రామకృష్ణ, నాయకులు, అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు పూర్తికి ప్రణాళికలు

విశాలాంధ్ర-పర్చూరు: ప్రధాన మంత్రి అవాస యోజన పథకం ద్వారా మంజూరై గృహ నిర్మాణాలు పూర్తి చేయటానికి ప్రణాళికబద్ధంగా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో ప్రద్యుమ్నకుమార్ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం గృహాలు పూర్తిచేయటానికి వంద రోజుల యాక్షన్ ప్లాన్‌లో భాగంగా పంచాయతీ కార్యదర్శులు, సచివాల ఉద్యోగులు, మండలస్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గృహ నిర్మాణాలు మార్చి 2025 నాటికి వందశాతం పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలని, లేనిచో రద్దు అవుతాయని తెలిపారు. ఈనెల 28 శనివారం నాడు సచివాలయ పరిధిలో లబ్దిదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించి గృహ నిర్మాణాలపై ప్రభుత్వ ఆశయాలను, ఆదేశాలను తెలిపాలని అన్నారు. సమావేశంలో హౌసింగ్ ఏఈ గేరా రాజ్‌కుమార్, ఈఓఆర్డీ రామకృష్ణ, అధికారులు ఉన్నారు.

పెంచిన కూలీ రేట్లు ప్రభుత్వం అమలు జరపాలి

- ఇసుకపల్లి ముఠా కార్మికులు నిరసన

విశాలాంధ్ర - రేపల్లె : రాష్ట్ర ప్రభుత్వం 2024 జనవరిలో గోడౌన్‌లో పనిచేస్తున్న కూలీలకు కూలి రేట్లు పెంచుతామని ప్రభుత్వం హామీలు ఇచ్చి 9 నెలల గడుస్తున్న ఇంతవరకు హమాలీ వర్కర్స్‌కు కూలి రేట్లు పెంచలేదని, ప్రభుత్వం వెంటనే తమ సమస్యలను పరిష్క రించాలని డిమాండ్ చేస్తూ గురువారం ఇసుకపల్లి వేర్హౌస్ గోదాముల ముందు నల్ల బ్యాడ్జీలు ధరించి కార్మికులు నిరసన ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నినాదాలు చేస్తూ కూలి రేట్ల పెంపుదల చేసి ఏరియాతో కలిపి జీవో విడుదల చేయాలని, ప్రతినెల 10వ తేదీ లోపుగా నెల బిల్లులు చెల్లించాలని, పని భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ స్టేట్ సివిల్ సప్లై కార్పొరేషన్ హమాలి వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ అనుబంధం రేపల్లె ఇసుకపల్లి గోడౌన్ ముఠా కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఎం.ఎల్.ఎస్ పాయింట్ వద్ద కూలీలు పెద్ద ఎత్తున నిరసన ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇసుకపల్లి గోడౌన్ ముఠా కార్మిక సంఘం అధ్యక్షులు మెరుగ వసంతరావు, అమర్తులూరి చంటి, చీకటి స్టాలిన్ బాబు, పెనుబాక నాగరాజు, తోడేటి రామయ్య, తదితర ముఠా కార్మికులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన ధర్నాలో పాల్గొన్నారు.

పెనుమర్రులో 'ఇది మంచి ప్రభుత్వం'

విశాలాంధ్ర - వేమూరు : ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలోని పెనుమర్రులో మండల శాఖ అధికారులు ప్రజాప్రతినిధులు పర్యటించారు. ఇంటింటికి తిరిగి సీఎం చంద్రబాబునాయుడు వంద రోజులు పాలనలో చేసిన అభివృద్ధి, ప్రభుత్వ పాలన గురించి వివరించారు. ఈ సందర్భంగా బ్రోచర్లను ఇంటింటికి తిరిగి అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కొక్కిలిగడ్డ సుమతి, మాజీ సర్పంచ్ మన్నే పసి, ఈఓపిఆర్‌డి శేఖర్, ఏపిఎం శోభన్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, వీఆర్వో జితేంద్ర సచివాలయ సిబ్బంది నాయకులు పాల్గొన్నారు.

ప్రాయశ్చిత్త దీక్షకు మద్దతుగా సంఘీభావ ర్యాలీ

విశాలాంధ్ర - రేపల్లె : నీ మతాన్ని, నీదేవుడిని ఆరాధించు, ఇతర మతాలను, దేవుళ్ళను గౌరవించు, సనాతన ధర్మాన్ని కాపాడాలని కోరుతూ వైసీపీ హయాంలో తిరుపతి లడ్డు విషయంలో జరిగిన అపచారానికిగానూ, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పవిత్రత కోసం చేపట్టిన ప్రాయశ్చిత్త దీక్షకు మద్దతుగా గురువారం సాయంత్రం కూరగాయల మార్కెట్ దగ్గర గల వినాయకుడి గుడి నుండి ఉప్పూడి రోడ్డు లో ఉన్న వెంకటేశ్వర స్వామి గుడి వరకూ సంఘీభావ ర్యాలీ జరిగింది. ముఖ్య అతిథులుగా రేపల్లె అసెంబ్లీ నియోజకవర్గ జనసేన సమన్వయకర్త ఎం. భాస్కరరావు, పట్టణ అధ్యక్షులు రాసంశెట్టి మహేష్, పట్టణ కార్యదర్శి గురుబ్రహ్మేశ్వర రావు, రేపల్లె రూరల్ అధ్యక్షులు జానకి రామయ్య, పట్టణ నాయకులు దేవగిరి శంకర్, సాయి, టీడీపీ నాయకులు, అనగాని శివప్రసాద్, మాజీ కౌన్సిలర్ దేవగిరి రంగారావు, ఎన్.వి ఉమా మహేశ్వరరావు, ఎం.పాములు, టి. శ్రీనివాసరావు, బిజెపి నాయకులు అన్నం సాయి వంప్రసాద్, పిన్ని సాంబశివరావు, రామాంజనేయులు శర్మ, రాంప్రసాద్, యోగానంద్ తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు పంపిణీ

విశాలాంధ్ర - అద్దంకి : వైద్య చికిత్స నిమిత్తం ప్రభుత్వం అందిస్తున్న నగదును అద్దంకి నియోజకవర్గంలోని ఐదుగురు లబ్ధిదారులకు గురువారం చిలకలూరి పేటలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అందజేశారు. అద్దంకి మండలం కోటికలపూడి గ్రామానికి చెందిన అనపర్తి మరిడమ్ అనే బాలుడు అనారోగ్యంతో బాధపడుతూ విజయవాడలోని మణిపాల్ హాస్పిటల్‌లో చేరగా అక్కడ వైద్య పరీక్షలు నిర్వహించిన అనంతరం వైద్యులు లివర్ ట్రాన్స్ ప్లాంటేషన్ చేయాలని సూచించారు. సరైన నిధులు లేమితో ఇబ్బంది పడుతున్న బాలుని తల్లిదండ్రులు స్థానిక నాయకులు మంత్రి దృష్టికి తీసుకురావడంతో స్పందించిన మంత్రి సీఎం సహాయ నిధికి లేఖ రాసి రూ. 15 లక్షల నిధులను మంజూరు చేయించారు. ఆ చెక్కును గురువారం లబ్ధిదారులకు అందజేశారు. చెక్కులను అందుకున్న వారిలో నియోజకవర్గానికి చెందిన రావిపాటి ఆంజనేయులు, పెంట్యాల సుబ్బారావు, రావూరి అరవింద్, మార్ల పాటి వీరాంజనేయులు ఉన్నారు.

వైసీపీ బాపట్ల జిల్లా అధ్యక్షుడిగా 'మేరుగ'

విశాలాంధ్ర - బాపట్ల : వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ బాపట్ల జిల్లా అధ్యక్షుడిగా మాజీ మంత్రి, వేమూరు మాజీ ఎమ్మెల్యే మేరుగు నాగార్జునను నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం గురువారం ప్రకటన విడుదల చేసింది. అదేవిధంగా బాపట్ల పార్లమెంట్ పరిశీలకులుగా మాజీ ఎంపీ నందిగం సురేష్‌ను కేటాయిస్తున్నట్లు పేర్కొంది. బాపట్ల జిల్లా వైసీపీ ఇంచార్జీల సమావేశంలో అధినేత జగన్ చీరాల వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసిన కరణం వెంకటేష్‌ను నియమించాలని తొలుత అధిష్టానం భావించిన కరణం తిరస్కరించినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో మేరుగను నియమించారు.

సీఎం సహాయ నిధికి చెక్కు అందజేత

విశాలాంధ్ర - కర్లపాలెం : వరద బాధితులకు మేము సైతం అండగా ఉంటామని మండలంలోని నల్లమోతువారిపాలెం గ్రామానికి చెందిన మాడా శ్రీనివాసరావు రూ. 15000, మర్రి అశోక్ చక్రవర్తి రూ. 5000, మునిపల్లి చిన్న రూ. 5000, గరిగంటి సుబ్రహ్మణ్యం రూ. 5000, డొంకెన, సుబ్రహ్మణ్యం రూ. 5000, నర్రావుల పున్నయ్య రూ. 2500, డొంకెన వెంకట రామారావు రూ. 2500 మొత్తం రూ. 40000లు సీఎం రిలీఫ్ ఫండ్‌కు చెక్కును బాపట్ల ఎమ్మెల్యేకు అందజేశారు. ఈ కార్యక్రమంలో బొంతు శివసాంబిరెడ్డి, మండల టీడీపీ అధ్యక్షులు ఏపూరి భూపతి రావు, పార్లమెంట్ నాయకులు నక్కల వెంకట స్వామి, జనసేన నాయకులు శ్రీకృష్ణ పాల్గొన్నారు.

చాకలి ఐలమ్మకు ఐక్యవేదిక ఘన నివాళులు

విశాలాంధ్ర - అద్దంకి : చాకలి ఐలమ్మగా పేరుగాంచిన చిట్యాల ఐలమ్మ 129వ జయంతి కార్యక్రమాన్ని గురువారం ఏపీ ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీస్ ఐక్యవేదిక సాహితీ వేత్తల ఆధ్వర్యంలో అద్దంకిలో ఘనంగా నిర్వహించారు. ముందుగా ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళలు అర్పించారు. ఈ సందర్భంగా అద్దంకి మాజీ సర్పంచ్ చెన్నుపల్లి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ చాకలి ఐలమ్మ మంచి పోరాట పటిమ కలిగిన వీరవనితని, ఆమె బాటలో అందరూ నడిచి పోరాటాలు చేసి పేదలకు అండగా నిలబడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో విద్వాన్ జ్యోతి చంద్రమౌళి, చెన్నుపాటి రామాంజనేయులు, ఉబ్బ దేవపాలన, ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు జ్యోతి రమేష్ బాబు, చెన్నుపల్లి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణా నియంత్రణకు చర్యలు

రేపల్లె రెవెన్యూ డివిజనల్ అధికారి హేలా షారోన్

విశాలాంధ్ర - రేపల్లె : ఇసుక అక్రమ రవాణా నియంత్రణకు పకడ్బందీ చర్యలు చేపట్టినట్లు రేపల్లె రెవిన్యూ డివిజనల్ అధికారి హేలా షారోన్ అన్నారు. గురువారం రేపల్లె ఆర్డీవో కార్యాలయంలో రెవిన్యూ, మైనింగ్, పోలీస్, ఇతర ఉన్నతాధికారులతో ఇసుక, మైనింగ్ అనుసరించవలసిన విధివిధానా లపై సమీక్ష సమావేశం ఆర్డీవో అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ కొల్లూరు, మండల పరిధిలోని అరవింద వారధి వద్ద ఇసుక అక్రమ తవ్వకాలు జరిగే ప్రదేశాలను గుర్తించడం జరిగిందన్నారు. రెవెన్యూ, పోలీసు, మైనింగ్ అధికారులతో ఏడు చెక్ పోస్టుల వద్ద పూర్తిస్థాయిలో పటిష్టమైన టీమ్స్ ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఇప్పటివరకు రెవిన్యూ డివిజన్ పరిధిలో 25 వాహనాలను సీజ్ చేసి జరిమానాలు విధించడం జరిగిందన్నారు. అక్టోబర్ 15వ తేదీ నుండి కొత్తగా గాజులంక, జువ్వలపాలెం వద్ద ఇసుక రీచ్‌లు ఏర్పాటు చేసే విధంగా మైనింగ్ శాఖ సర్వే చేస్తున్నదని అందుకు అనుగుణంగా ప్రభుత్వం ఇచ్చిన నియమ నిబంధన ప్రకారం ఇసుక అక్రమ రవాణా జరగకుండా చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. ఇసుక అక్రమ రవాణాను ఎందుకు అడ్డుకోలేకపోతున్నారని ఆమె రెవెన్యూ, మైనింగ్, పోలీసు, అధికారులను ప్రశ్నించారు. ఈ సందర్భంగా సీఐ వీరాంజ నేయులు, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, మాట్లాడుతూ కృష్ణా నది నుంచి ప్రధాన మార్గాల నుంచి కాకుండా ఇతర మార్గాల నుంచి ఇసుక అక్రమ రవాణా సాగిస్తున్నారని నియంత్రణ కోసం కొల్లూరు, భట్టిప్రోలు మండలాల పరిధిలోని ఏడు ప్రాంతాల్లో వీఆర్వోలు, పోలీస్ కానిస్టేబుల్‌తో పికెటింగ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎవరైనా అక్రమంగా ఇసుక వ్యాపార ధోరణితో చేస్తే కఠినమైన చర్యలు తీసుకోవడం జరుగుతున్నాయని ఇసుకాసురులను ఆర్డీవో హెచ్చరించారు.

ఈ సమావేశంలో రేపల్లె, వేమూరు, నియోజకవర్గాల పరిధిలోని ఆయా మండలాల తహసీల్దారులు, రెవెన్యూ ఇన్స్పెక్టర్లు, మైనింగ్ అధికారులు, పోలీస్ అధికారులు, వీఆర్వోలు, పోలీసు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ లబ్ది

- ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ

విశాలాంధ్ర - పిట్టలవానిపాలెం : కూటమి ప్రభుత్వ వంద రోజుల పాలనలో అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ లబ్ది చేకూరిందని ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ అన్నారు. మండలంలోని చందోలు గ్రామంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ పాల్గొని గడపగడపకు తిరిగి ఇది మంచి ప్రభుత్వం స్టిక్కర్లను అంటించి కరపత్రాలను పంపిణీ చేసి 100 రోజుల ప్రభుత్వం గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నరేంద్ర వర్మ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ఎన్డీఏ కూటమి ప్రభుత్వం మంచి పాలన అందిస్తుందని ప్రజల అవసరాలకు అనుగుణంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. చందోలు నుండి పొన్నూరు వెళ్లే రోడ్డు గత ప్రభుత్వంలో నిధులు ఇవ్వకుండా ఆపేశారు త్వరలో ఆ రోడ్డును వేయస్తానని తెలియజేశారు. ఆర్.డి.ఓ రవీందర్, తాసిల్దార్ మెహర్ కుమార్, డి.యల్.డి.ఓ సువార్తమ్మ, ఎంపిడిఓ శేషమాంబ, పంచాయతీ స్పెషల్ ఆఫీసర్ భాగ్య రాజు, జనసేన సమన్వయకర్త నామన శివన్నారాయణ, మండల తెదేపా అధ్యక్షులు అఫ్జల్, గ్రామ పార్టీ అధ్యక్షులు రజాక్, నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

కొండబోట్లవారిపాలెంలో 'స్వచ్ఛత హీ సేవా'

విశాలాంధ్ర - బాపట్ల రూరల్ : మండలంలోని కొండబోట్లవారిపాలెంలో గురువారం స్వచ్ఛత హీ సేవా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బాపట్ల పార్లమెంట్ మహిళా ప్రధాన కార్యదర్శి పల్లం సరోజి జీవన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సరోజిని మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రంగా ఉంచుకుంటూ, చెట్లు పెంచవలసిన ఆవశ్యకత, ప్లాస్టిక్ వ్యర్థాల వల్ల కలిగే నష్టం 2047 కల్లా ఆంధ్రప్రదేశ్ దేశంలోనూ నెంబర్ వన్‌లో ఉండాలని కూటమి ప్రభుత్వంలో ప్రధానమంత్రి మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నేతృత్వంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో కొనసాగుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సబ్ యూనిట్ ఆఫీసర్ షకీల్, రాంబాబు, హెల్త్ సూపర్వైజర్ బాపట్ల టౌన్ ధనలక్ష్మి, సిహెచ్ఓ మహాలక్ష్మి, తెలుగు యువత అధ్యక్షుడు ఉమ్మారెడ్డి వెంకటేష్, గ్రామ పార్టీ అధ్యక్షుడు కొండలు, బూత్ ఇంచార్జ్ మార్పు ప్రతాప్, హెల్త్ ఇన్స్పెక్టర్, ఫీల్డ్ అసిస్టెంట్ వాసు, కె.వి పాలెం జిల్లా పరిషత్ స్కూల్ సిబ్బంది, విద్యార్థులు గ్రామ సచివాలయ అధికారులు, నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

సబ్ ట్రెజరీ ఉద్యోగుల సస్పెన్షన్

విశాలాంధ్ర - చీరాల రూరల్ : చీరాల ఉప ఖజానా కార్యాలయంలో లంచాల కోసం బిల్లులు ఆపిన ఆరోపణలపై బాపట్ల కలెక్టర్ వెంకట మురళి విచారణ జరిపించారు. అనంతరం నివేదికను రాష్ట్ర ట్రెజరీ డైరెక్టర్‌కు పంపి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై స్పందించిన డైరెక్టర్ అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న సబ్ ట్రెజరీ అధికారిణి భాగ్యలక్ష్మి, సీనియర్ అకౌంటెంట్ సుధీరలపై సస్పెన్షన్ వేటు వేస్తూ ఉత్తర్వులు వెలువరించారు.

బ్రాంచ్ ఏర్పాటు చేయాలి

విశాలాంధ్ర - చీరాల రూరల్ : మండలంలోని గవినివారిపాలెం గ్రామ పంచాయితీ పరిధిలో యూనియన్ బ్యాంక్ బ్రాంచి ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య అన్నారు. యూనియన్ బ్యాంక్ ప్రకాశం జిల్లా రీజనల్ మేనేజర్ రవీందర్‌ను కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వ్యవసాయ పనులు ప్రారంభం అవుతున్న ప్రస్తుత తరుణంలో రైతుల సౌకర్యార్థం యూనియన్ బ్యాంక్ బ్రాంచిని ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

వరద బాధితులకు సిఫార్డు స్వచ్ఛంద సేవా సంస్థ సాయం

విశాలాంధ్ర - రేపల్లె : స్థానిక సిఫార్డు స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఇటీవల సంభవించిన వరదల వలన తీవ్రంగా నష్టపోయిన రేపల్లె మండలంలోని మోరుమూల గ్రామాలైన బొబ్బర్లంక, పిరాట్ లంక గ్రామాలలో నివసిస్తు అకస్మాత్తుగా సంభవించిన తీవ్రమైన వరదల వలన సర్వస్వం కోల్పోయిన 82 దళిత యానాది కుటుంబాలకు నిత్యావసరాలతో కూడిన ఆహార పదార్థాల కిట్లను సిఫార్డు స్వచ్ఛంద సేవా సంస్థ డైరెక్టర్ కొమరాబత్తిని రవి ప్రదీప్ గురువారం అందజేశారు. బొబ్బర్లంక, పిరాట్ లంకలకు చెందిన 82 యానాది కార్యక్రమంలో సిఫార్డు స్వచ్ఛంద సేవా సంస్థ కార్యకర్తలు కిషోర్ కుమార్, నాగరాజు, రామకృష్ణ పాల్గొన్నారు.

వార్డుల్లో 'ఇది మంచి ప్రభుత్వం'

విశాలాంధ్ర - రేపల్లె : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి నూరు రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా పట్టణంలోని 17,18,19,20,21 వార్డుల సచివాలయాలలో గురువారం ఇది మంచి ప్రభుత్వం ప్రజా ప్రభుత్వం కార్యక్రమాన్ని మున్సిపల్ కమిషనర్ కాకర్ల సాంబశివరావు అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో కమిషనర్ మాట్లాడుతూ సీఎం నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం వంద రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ప్రజలకు అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిన ఘనత కూటమి ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. అదేవిధంగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన విధంగా స్వచ్ఛత హి సేవా కార్యక్రమం ద్వారా అక్టోబర్ రెండో తేదీ వరకు జరిగే కార్యక్రమాల్లో ప్రజలు భాగస్వాములై ఇంటి పరిసరాలు తో పాటు పరిశుభ్రత పాటించాలని కమిషనర్ అన్నారు. అదేవిధంగా కృష్ణా నది కరకట్ట పెను ప్రమాదం నుండి ప్రజలను కాపాడడంలో రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ సోదరుడు శివ ప్రసాదు సహాయ కార్యక్రమాల్లో అహర్నిశలు శ్రమించి పెనుముప్పు నుండి ప్రజలను కాపాడారని నాగమల్లేశ్వరరావు అన్నారు. అ ఈ సందర్భంగా కరపత్రాలు స్టిక్కర్లు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మహిళ నాయకులు పంతగాని ప్రేమలత. మోర్ల అరుణకుమారి, మున్సిపల్ ఆర్ఐ యార్లగడ్డ ప్రసాద్, ఇంచార్జ్ మేనేజర్ రత్నాంజలి, సచివాలయ సిబ్బంది, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

క్రీడలు మానసికోల్లాసానికి దోహదం

మండల విద్యాశాఖ అధికారి సురేష్

విశాలాంధ్ర - రేపల్లె : విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలు మానసికోల్లాసాన్ని ఇస్తాయని మండల విద్యాశాఖ అధికారి కే.సురేష్ అన్నారు. గురువారం రేపల్లె 26 వార్డులోని మౌంట్ ఫోర్ట్ హైస్కూల్‌లో రేపల్లె నియోజకవర్గం బాలుర బాలికల అండర్ 14,17 సంవత్సరాల బాలుర బాలికల క్రీడల పోటీలు ప్రారంభమైనాయి. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంఈఓ సురేష్ మాట్లాడుతూ ఈనెల 23,24 తేదీల్లో మండల స్థాయిలో బాలుర, బాలికలకు క్రీడల పోటీలు నిర్వహించడం జరిగిందన్నారు. క్రీడలను ప్రోత్సహించేందుకు మౌంట్ ఫోర్ట్ హైస్కూల్ యాజమాన్యం చేస్తున్న కృషిని ఎంఈఓ అభినందించారు. ఈ క్రీడల పోటీలకు కో-ఆర్డినేటర్‌గా ఎడ్ల రమేష్ బాబు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో మౌంట్ ఫోర్ట్ హైస్కూల్ డైరెక్టర్ బ్రదర్ కిరణ్ కుమార్, వ్యాయామ ఉపాధ్యాయులు, ఫిజికల్ డైరెక్టర్లు పాల్గొన్నారు.

బహుజన ఉద్యమాల సారథి పెనుమాల సుబ్బారావు

విశాలాంధ్ర - రేపల్లె : పట్టణ అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడిగా ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శిగా, రేపల్లె ప్రాంతంలో బహుజన కార్మికవర్గాల హక్కుల కోసం పోరాటాలు చేస్తూ రేపల్లె ప్రాంతంలో ప్రజా ఉద్యమాలకు ఊపిరి పోసినటువంటి వ్యక్తి పెనుమాల సుబ్బారావు నేడు మన మధ్య లేకపోయినప్పటికీ ఆయన పోరాట స్ఫూర్తి మరువలేనిదని జై భీమ్ రావు భారత్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి రేపల్లె అసెంబ్లీ ఇన్‌ఛార్జి దోవా రమేష్ రాంజీ కొనియాడారు. పట్టణంలోని ఉప్పుడి రోడ్డు 13వ వార్డులో పెనుమాల సుబ్బారావు ప్రథమ వర్ధంతి కుటుంబ సభ్యులు నిర్వహించారు. జై భీమ్‌రావు భారత్ పార్టీ జిల్లా కమిటీ సభ్యులు పోతారలంక శివ వెంకటేశ్వరరావు, రేపల్లె మండల కన్వీనర్ కర్రా బాబురావు, కుటుంబ సభ్యులు పెనుమాల క్రాంతి కిరణ్, దాసరి ప్రకాష్, పాల్గొన్నారు 13వ వార్డులోని విద్యార్థులకు నోటు పుస్తకాలను పంపిణీ చేశారు.

పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో తగ్గని వర్షపునీరు

విశాలాంధ్ర - రేపల్లె : మంగళవారం రాత్రి నుండి బుధవారం ఉదయం వరకు ఏకదాటిగా కురిసిన భారీ వర్షాల కారణంగా పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రాంగణాలు వర్షపు నీటితో నిండిపోయి చెరువులను తలపిస్తున్నాయి. వర్షము కురిసి ఎండ వచ్చినప్పటికీ ఇంకా కళాశాల ప్రాంగణంలో వర్షపు నీరు నేటి వరకు తగ్గకపోవడం చెరువు లాగానే కనిపిస్తున్నది. ఎండ ప్రభావం వలన వర్షం నీరు తగ్గకపోగా వర్షపు నీరు ప్రాంగణంలో దర్శనమిస్తున్నది. కళాశాలకు వచ్చే విద్యార్థులు, లెక్చరర్లు ఈ వర్షపు నీటిలో నడిచి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది అని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే మున్సిపల్ అధికారులు, ఇంజన్లు ఏర్పాటు చేసి నీరు తొలగించే చర్యలు చేపట్టాలని విద్యార్థులు వారి తల్లి దండ్రులు కళాశాల అధ్యాపకులు సిబ్బంది కోరుతున్నారు.

మహారాజశ్రీ ఒంగోలు స్పెషల్ జిల్లా జడ్జివారి కోర్టులో

ఎం.వి.ఓ.పి.నంబర్. 97/2024 మరియు ఎం.వి.ఓ.పి.నంబర్. 98/2024

ఎనిబెర చిన్న గురవయ్య మరొకరు - పిటీషనర్స్

మరియు

రాయక్రిష్ణ చైతన్య వగైరాలు - రెస్పాండెంట్స్

ఆర్ 3: షేక్ సుల్తాన్, తండ్రి: సిలార్ ఓనర్ ఆఫ్ ది ఆటోరిక్షా ఏపి 30 వి 0825 దొడ్డవారి స్ట్రీట్, మార్కాపురం పోస్ట్ అండ్ టౌన్, ప్రకాశం జిల్లా.

పై కేసులో మీకు నోటీసు నిమిత్తం అనేక పర్యాయాలు రిజిస్టర్ పోస్టు ద్వారా, కోర్టు ద్వారా నోటీసులు పంపించినను తీసుకొనక కాలయాపన చేయుచున్నందున, కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం ఈ పేపరు ద్వారా మీకు నోటీసులు పంపించడమైనది. కావున మీరు **09-10-2024 తేదీన** పై కోర్టువారి ఎదుట **ఉదయం 10-30గంటలకు** స్వయంగా గాని, లాయర్ ద్వారా గాని హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకోవలసినది. లేనియెడల మీ పరోక్షమున తీర్మానించబడునని ఇందు మూలముగా తెలియజేయడమైనది.

వాయిదా: 09-10-2024

పి గోవిందయ్య

పిటీషనర్స్ తరపున న్యాయవాది

కదిరి బాబురావు

వ్యవసాయ కళాశాల విద్యార్థులు విహారయాత్ర

విశాలాంధ్ర-సీఎస్‌పురం : సీఎస్‌పురం కదిరి బాబురావు వ్యవసాయ కళాశాలలో తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు దక్షిణ భారత దేశ విహారయాత్రలో భాగంగా గురువారం కర్ణాటక రాష్ట్రంలోని మండ్యాలో వి.సీ. ఫామ్ మరియు తమిళనాడు రాష్ట్రంలోని ఊటీ, కొడైకెనాల్ తదితర వ్యవసాయ క్షేత్రాలను సందర్శించారు.

జొన్న విత్తనాల పంపిణీ

విశాలాంధ్ర-సీఎస్‌పురం : మండలంలోని కోవిలంపాడు పంచాయతీ సచివాలయం మిట్టపాలెం గ్రామంలో గురువారం రైతులకు ఉచిత జొన్న విత్తనాల పంపిణీ జరిగింది. ఒంగోలు పార్లమెంట్ తెలుగు యువత అధికారి షేక్ రజ్జబ్ బాషా మరియు కోవిలంపాడు పంచాయతీ టీడీపీ అధ్యక్షులు షేక్ నాయబ్ రసూల్ కలిసి జొన్న విత్తనాల పంపిణీ ప్రభుత్వం ఉచితంగా అందచేస్తున్న జొన్న విత్తనాలను రైతులు సద్వినియోగం చేసూకోవాలని ఆయన కోరారు. ఒంగోలు పార్లమెంట్ తెలుగు యువత అధికార ప్రతినిది షేక్ రజ్జబ్ బాషా, కోవిలంపాడు పంచాయతీ టీడీపీ అధ్యక్షులు షేక్ నాయబ్ రసూల్, మండల టీడీపీ నాయకులు తీకినం లక్ష్మీనారాయణ, సచివాలయం ఉద్యోగి అమృత, చావా వెంకట సుబ్బయ్య, చావా ప్రభాకర్, షేక్ హజరత్, బోట్ల నారాయణమ్మ మరియు రైతులు పాల్గున్నారు.

మాగుంట పార్వతమ్మకు ఘననివాళులు

విశాలాంధ్ర-తాళ్లూరు : మాజీ ఎంపీ, ఎమ్మెల్యే మాగుంట పార్వతమ్మ మృత దేహానికి గురువారం తాళ్లూరు జడ్పీటీసీ మారం వెంకట రెడ్డి, బెల్లంకొండ వారి పాలెం సర్పంచి పీఎస్ శ్రీకాంత్ రెడ్డి, ఎంపీటీసీ జీఎస్ ప్రభాకర్ రెడ్డిలు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఎంపీ మాగుంట శ్రీనివాస రెడ్డిని కలసి వారి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

టీడీపీ నాయకులు

మాజీ ఎంపీ, ఎమ్మెల్యే మాగుంట పార్వతమ్మ మృత దేహాన్ని టీడీపీ నాయకులు, ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు గురువారం సందర్శించి ఘన నివాళులర్పించారు. ఎంపీ మాగుంట శ్రీనివాసరెడ్డి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. నివాళులు అర్పించిన వారిలో టీడీపీ మండల పార్టీ అధ్యక్షులు బి. ఓబుల్ రెడ్డి జిల్లా కార్యదర్శి మానం రమేష్, రాష్ట్ర మైనార్టీ సెల్ కార్యదర్శి షేక్ కాలేషావలి (బడే), టీడీపీ రాష్ట్ర యూత్ కార్య దర్శి వేణుబాబు, తెలుగు యువత వేణు ,బి.సి సెల్ అధ్యక్షుడు పిన్నిక రమే ష్, క్లస్టర్ ఇన్‌ఛార్జి ఆర్. వెంకట రావు, దర్శి కౌన్సిలర్ వి.సి రెడ్డి ఉన్నారు.

ఈవ్ టీజింగ్ పాల్పడితే కఠిన చర్యలు:ఎస్సై

విశాలాంధ్ర-తాళ్లూరు : విద్యార్థులు గుడ్ టచ్ బ్యాడ్ టచ్ పై అవగాహన కలిగి ఉండాలని ఎస్సై మల్లికార్జునరావు అన్నారు. స్థానిక వికె ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం విద్యార్థులకు ఈవ్ టీజింగ్ పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ విద్యార్థులు సమయాన్ని చక్కగా వినియోగించుకోని విద్యను అభ్యసించాలని కోరారు. ఏవైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని చెప్పారు. ఉపాధ్యాయులు, మహిళా పోలీసులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికల హామీలు నెరవేరుస్తాం

ఎమ్మెల్యే ముత్తుముల

విశాలాంధ్ర-గిద్దలూరు : ఎన్నికల మ్యానిఫెస్టోలో ఎన్డీయే ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన అన్నీ హామీలను నెరవేర్చి తీరుతామని గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి ఘంటాపథంగా తెలిపారు. "ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఏడవ రోజు గిద్దలూరు మండలం, ముండ్లపాడులో నిర్వహించిన ప్రజావేదిక కార్యక్ర మంలో పాల్గొన్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డికి గ్రామ ప్రజలు, నాయకులు, కార్యకర్తలు మేళాతాళాలతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాడు రాష్ట్రంలో అధికారంలో ఉన్న దుష్ట పాలనను అంతమొందించి అధికారంలోకి వచ్చిన చంద్రన్న కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రకటించిన మ్యానిఫెస్టోలో చెప్పిన ప్రతీ కార్యక్రమాన్ని చేసి చూపిస్తామని, మనది మాటల ప్రభుత్వం కాదని, చేతల ప్రభుత్వ మన్నారు. ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే ప్రజల మన్ననలు పొంది ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా, ప్రజల వద్దకే పాలన అనే నినాదంతో ముందుకు పాలన సాగిస్తున్నా మన్నారు. ప్రజావేదికలో ప్రజలు ఇచ్చిన అర్జీలను స్వీకరించి వాటిని పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్, లక్ష్మీదేవి, ఉపసర్పంచ్ కడియం శేషగిరి, స్థానిక నాయకులు బొమ్మినేని వెంకటేశ్వర్లు, గంజి వీరయ్య, శివపురం మురళీ, బీసీ నాయకులు బైలడుగు బాలయ్య, మాజీ సర్పంచులు ముచ్చుకుంట్ల రామ సుబ్బయ్య, బోధనబోయిన గోపాలకృష్ణ, ప్రధాన కార్యదర్శి ఎల్ఐసీ నరసింహులు, మరియు మండల ఎంపీడీఓ, మండల ఎంఈఓ కావడి వెంకటేశ్వర్లు, ఏమ్మార్వో ఆంజనేయరెడ్డి, మండల అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

సైన్స్ ల్యాబ్ రికార్డులు పంపిణీ

విశాలాంధ్ర-గిద్దలూరు : పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (బాలురు) గిద్దలూరు నందు నిర్వహిస్తున్న హైస్కూల్ ప్లస్ (బాలికలు) కళాశాలలో చదువుతున్న 20 మంది విద్యార్థినీలకు అవసరమైన సైన్స్ ల్యాబ్ రికార్డులను యశ్వంత్ ఎడ్యుకేషనల్ సొసైటీ గౌరవాధ్యక్షులు డాక్టర్ మొర్రి పిచ్చయ్య గురువారం పంపిణీ చేశారు. తన వార్షిక వేతనంలో 20 శాతం డబ్బులను విద్యాభివృద్ధికి ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. దాత డాక్టర్ మొర్రి పిచ్చయ్య మాట్లాడుతూ చదువుకోవడానికి పేదరికం అడ్డు రాదని, ప్రతి విద్యార్థి లక్ష్యాన్ని నిర్ణయించుకొని సాధన చేస్తే సాధించలేనిది ఏమీ లేదని, విద్యార్థులను మోటివేషన్ చేశారు. ప్రతి విద్యార్థి సామాజిక స్పృహ కలిగి సామాజిక బాధ్యత తీసుకోవాలన్నారు. విద్యార్థులను ఉద్దేశించి మోటివేషనల్ స్పీచ్ ఇచ్చారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ బి.అనురాధ అధ్యక్షత వహించి దాతను అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ రసూల్, కళాశాల సిబ్బంది రాజేంద్రప్రసాద్, సగీర్, కాశయ్య, కృపాదానం, శోభారాణి తదితరులు పాల్గొని దాతను అభినందించారు. విద్యార్థులు దాతకు ధన్యవాదాలు తెలిపారు.

28న కనిగిరిలో ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర-హనుమంతునిపాడు : కనిగిరి నియోజకవర్గం వైసీపీ ఇన్‌ఛార్జి డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్ ఆధ్వర్యంలో ఈనెల 28వ తేదీన శనివారం పట్టణంలోని గార్లపేట రోడ్డు లో ఉన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు పార్టీ కార్యకర్తలకు తెలియజేశారు. అలానే తిరుమల పవిత్రత స్వామి వారి ప్రసాదం విశిష్టతను అపవిత్రం చేసినందుకు మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు శనివారం ఉదయం 10 గంటలకు నిర్వహించే కార్యక్రమానికి వైసీపీ శ్రేణులందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

వరద బాధితులకు సాయం

విశాలాంధ్ర-గిద్దలూరు : పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డిని అర్ధవీడు మండల ఫర్టీలైజర్స్ అసోసియేషన్ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి విజయవాడ వరద బాధితుల సహాయార్థం తమ వంతు సహకారంగా రూ.50వేలు చెక్కును ఎమ్మెల్యేకి అందచేశారు. ఈ సందర్భంగా వారిని ఎమ్మెల్యే అభినందించారు. ఈ కార్యక్రమంలో ఫర్టిలైజర్స్ అసోసియేషన్ సభ్యులు ఎం మల్లికార్జునరావు, బంకు రంగయ్య, లాకా రమణ, షేక్ అబ్దుల్, వెంకటేశ్వర్లు, సుభాని, మాకా వెంకటసుబ్బయ్య, ఏ. వెంకటేశ్వర రెడ్డి, కారే శ్రీనివాసులు, నరేంద్ర రెడ్డి, రవి, రాధాకృష్ణ, చాంద్ బాషా, రఘు కోటి పాల్గొన్నారు.

సీఎం చంద్రబాబుకు ధన్యవాదాలు: మాస్తానయ్య

విశాలాంధ్ర-మార్కాపురం : గత సోమవారం జరిగిన రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖ సమీక్ష సమావేశంలో గౌరవ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్ర నూరు బాషా కార్పొరేషన్ ఏర్పాటు చేసి అందుకు వంద కోట్ల రూపాయల నిధులను ఏర్పాటు చేస్తానని చెప్పడం అభినందనీయమని రాష్ట్ర నూరు భాషా సంఘం ఉపాధ్యక్షులు దూదేకుల మస్తానయ్య సీఎం చంద్రబాబుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా మస్తానయ్య కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాష్ట్ర నూర్ భాషా సంఘం తరపున సీఎం చంద్రబాబుకు, రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖా మంత్రి ఎం.డి. ఫరూక్'కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఎప్పటినుండో ఎదురుచూస్తున్న నూర్ భాషా సంఘం కార్పొరేషన్ ఏర్పాటుకు వచ్చే క్యాబినెట్ సమావేశంలోనే ఆమోదం పొందుతుందని తెలియజేయడం శుభ పరిణామమని, నూర్ భాషాలైన దూదేకుల కులస్తులను చంద్రబాబు గౌరవించడం అనేది హర్షించదగ్గ విషయమని అన్నారు. అలాగే రాష్ట్రంలో నూరు భాషా దూదేకుల కులస్తులకు నామినేటెడ్ పదవులలో ప్రత్యేక స్థానం కల్పించి గౌరవించాలని, రాష్ట్ర నూర్ భాషా దూదేకుల కార్పొరేషన్ చైర్మన్'గా అత్యంత వెనుకబడిన ప్రకాశం పశ్చిమ ప్రాంతానికి అవకాశం కల్పించాలని వారు ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో నూరు బాషా సంఘం పట్టణ అధ్యక్షులు డి.పెద్ద హుస్సేన్, డివిజన్ అధ్యక్షులు దూదేకుల కాసిం, డివిజన్ కార్యదర్శి డి.గురవయ్య, మార్కాపురం పట్టణ సంఘం సభ్యులు డి.కాసిం, డి.బాబు, డి.వలి, తదితరులు పాల్గొన్నారు.

నూతన ఎస్సైకు సత్కారం

విశాలాంధ్ర-హనుమంతునిపాడు : హనుమంతునిపాడు ఎస్సైగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన కే మాధవరావును గురువారం సబ్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయంలో టీడీపీ రాష్ట్ర తెలుగు యువత కార్య దర్శి ముప్వ రంగసాయి యాదవ్ మర్యాద పూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేసి శాలువా కప్పి ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా రంగసాయి మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం మీ సేవలు అమూల్యమైనవని, ప్రజా సమస్యల పరిష్కారానికి న్యాయపరంగా కృషి చేయాలని ఎస్సైని కోరారు. సన్మానించిన నాయకులకు ఎస్సై ధన్యవాదాలు తెలిపారు.ఎస్సైని సత్కరించిన వారిలో మండల నాయకులు రమేష్ రెడ్డి, కోటపాటి శేషయ్య,మిట్టపాలెం గ్రామ పార్టీ అధ్యక్షులు గురుకృష్ణ,దాసరిపల్లి ప్రసాద్, ఐటిడిపి యూనిట్ ఇన్‌ఛార్జి అశోక్ పాల్గొన్నారు.

స్వచ్ఛ చీరాల లక్ష్యం : ఎమ్మెల్యే కొండయ్య

విశాలాంధ్ర - చీరాల : మహాత్మగాంధి కలలు కన్న స్వాతంత్ర్య భారత దేశమే కాకుండా పరిశుభ్రమైన అభివృద్ధి చెందిన దేశంగా వృద్ధి చెందాలని ప్రతి పౌరుడు స్వచ్ఛ చీరాల స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ నిర్మాణానికి నడుం బిగించాలని ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య అన్నారు.గురువారం పట్టణంలో అంబేద్కర్ సర్కిల్లో స్వచ్ఛ చీరాల స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ ప్రతిజ్ఞ కౌన్సిలర్లతో కలసి ఎమ్మెల్యే చేశారు.ఈ కార్యక్రమంలో మాలకొండయ్య మాట్లాడుతూ స్వచ్ఛ భారత్ సాధించాలంటే మన ఇంటి నుంచే ఉద్యమం ప్రారంభమవ్వాలని మన పరిసరాలు శుభ్రంగా వుంటే మన ఊరు శుభ్రంగా ఉంటుందన్నారు. జన సేన,బిజెపి, కూటమి నాయకులు విద్యార్థులు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

చిరస్మరణీయురాలు వెలగపూడి సరస్వతమ్మ

విశాలాంధ్ర - బాపట్ల : బాపట్ల ప్రాంతంలో స్త్రీ విద్యవ్యాప్తికి విశేషంగా కృషి చేసిన వారిలో అగ్రగణ్యులు వెలగపూడి సరస్వతమ్మ అని ఫోరం కార్యదర్శి డాక్టర్ పిసి సాయిబాబు అన్నారు. గురువారం సరస్వతమ్మ వర్ధంతి సందర్భంగా ఫోరం ఫర్ బెటర్ బాపట్ల ఆధ్వర్యంలో ఎస్ఎంజి జూనియర్ కళాశాల వద్దనున్న ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1915లో ఆమెచే ప్రారంభించబడిన యువతి విద్యా నిలయం నేడు ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలగా అభివృద్ధి చెందిందన్నారు. రచయిత్రి చిల్లర భవానీ దేవి,ఉన్నత పాఠశాల హెచ్ఎం రమాదేవి, ఉపాధ్యాయులు శ్రీదేవి,వెంకటేశ్వరరావు,శ్రీనివాసరావు,విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజల శ్రేయస్సే కూటమి ప్రభుత్వం లక్ష్యం

విశాలాంధ్ర - యద్దనపూడి : ప్రజల శ్రేయస్సే కూటమి ప్రభుత్వ లక్ష్యమని మండల టీడీపీ అధ్యక్షులు నల్లపనేని రంగయ్య చౌదరి అన్నారు. మండలంలోని గన్నవరం గ్రామంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వంద రోజుల లోపే సీఎం చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్,రాష్ట్ర ప్రజలకు సంక్షేమం అందించే విషయంలో ముందంజలో ఉన్నారని, కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను ఇప్పటికే మూడిటిని అమలు చేసిందని, అన్నారు.ఎంపీడీవో కృష్ణకుమారి మాట్లాడుతూ అధికారులు, ప్రభుత్వం చేసే ప్రతి అభివృద్ధి కార్యక్రమాన్ని ప్రజలకు దరి చేర్చడమే ప్రభుత్వ ఆకాంక్ష అన్నారు. తహసీల్దార్ రవికుమార్,జడ్పీటీసీ నారాయణమ్మ,ఎంపీటీసీ గొట్టిపాటి సతీష్,పత్తిపాటి వేణుబాబు,సోమేపల్లి బాబు, నాయకులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధికి రూ.5లక్షలు విరాళం

విశాలాంధ్ర - రేపల్లె : వరద బాధితుల సహాయార్థం సీఎం సహాయనిధికి రూ.5 లక్షలు రేపల్లెకు చెందిన మదర్ థెరిస్సా హాస్పిటల్ చైర్మన్ డాక్టర్ నల్లపనేని నాగ రాజేంద్ర,డాక్టర్ సునీత దంపతులు అందజేశారు.రాష్ట్ర సచివాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో వరద బాధితులను ఆదుకునేందుకు సీఎం నారా చంద్రబాబునాయుడు పిలుపుమేరకు తమ వంతుగా ఈ విరాళాన్ని అందించినట్లు డాక్టర్ రాజేంద్ర,డాక్టర్ సునీత తెలిపారు.రాష్ట్ర స్టాంప్స్ అండ్ రెవెన్యూ శాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్ నేతృత్వంలో సెక్రటేరియట్‌లో రూ.5 లక్షల చెక్‌ని చంద్రబాబు నాయుడుకి అందజేశారు. డాక్టర్ దంపతులను అభినందించారు.

హమాలీ కార్మికుల కూలీ రేట్లు పెంచండి

- నూతన అగ్రిమెంట్ చెయ్యాలని నిరసనలు
- పట్టణంలో హమాలీ వర్కర్ల భారీ ర్యాలీ

విశాలాంధ్ర - చీరాల : రాష్ట్రంలో నిత్యవసర ధరలు పెరుగుతున్న కానీ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సివిల్ సప్లై కార్మికుల కూలి రేట్లు పెరగట్లేదని ప్రభుత్వం వెంటనే నూతన అగ్రిమెంట్ చేసి హమాలీ కార్మికుల కూలీ రేట్లు పెంచాలని సివిల్ సప్లై హమాలీ వర్కర్స్ యూనియన్ బాపట్ల జిల్లా కార్యదర్శి బాసి పైడయ్య అన్నారు.గురువారం హమాలీల కూలీ రెట్లు పెంచాలని కోరుతూ చీరాల పట్టణంలో ర్యాలీ నిర్వహించి చీరాల మండల తహసీల్దార్‌కి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బత్తుల శామ్యూల్,సీపీఐ సీనియర్ నాయకులు మేడ వెంకట్రావులు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా సివిల్ సప్లై హమాలీ కార్మికులు ఎత్తుడు,దించుడూ కూలీ రెట్లు పెంచి ప్రభుత్వం జీఓ విడుదల చేయాలన్నారు.అగ్రిమెంట్ కాల పరిమితి ముగిసినప్పటికీ నూతన అగ్రిమెంటు ప్రభుత్వం చేయలేదని, ప్రభుత్వం తక్షణమే నూతన అగ్రిమెంట్ చెయ్యాలన్నారు.రాష్ట్రంలో నిత్యవసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటుతుంటే కూలీలు జీతం పెరగక కుటుంబ జీవనం ఎలా సాగుతుందో ప్రభుత్వం ఆలోచించాలన్నారు.నూతన అగ్రిమెంట్ చేయకపోవడం వలన రెక్కాడితే గాని డొక్కాడని కూలీలు చాలిచాలని జీతాలతో జీవితం గడుపుతున్నారని,చీరాలలో అధికారులు కనీసం మంచి నీటి బిల్లులు కూడా పెట్టడం లేదన్నారు.ప్రభుత్వం తగ్గించిన షాపులని యధావిధిగా కొనసాగించాలని,ప్రతి నెల పదవ తేదీకల్ల నెల బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు.హమాలీ కార్మికులకు పని భద్రత కల్పించాలని,చీరాలలో సొంత గోడౌన్లు ఏర్పాటు చెయ్యాలన్నారు.ప్రభుత్వం చిత్తశుద్ధితో హమాలీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని లేదంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని కార్మికుల కోపానికి గురికావద్దని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.అనంతరం డిప్యూటీ తహసీల్దార్ అర్జున్‌కి వినతిపత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు రామేశ్వరం కుమార్,దళిత బహుజన పార్టీ జిల్లా నాయకులు షేక్ జిలానీ,హమాలీ కూలీలు శ్రీను, అప్పన్న,వెంకట రెడ్డి,అప్పన్న,రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

అట్టహాసంగా స్కూల్ గేమ్స్ ప్రారంభం

విశాలాంధ్ర - వేటపాలెం : మండల పరిధిలోని పందిళ్ళపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, పందిళ్ళపల్లిలో చీరాల నియోజకవర్గ స్థాయి ఆటల పోటీలు చీరాల డివిజన్ డిప్యూటీ డి.ఈ.ఓ అబ్బ రాజు శ్రీనివాసరావు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల శారీరక,మానసిక వికాసానికి ఆటలు ఎంతగానో తోడ్పడతాయని,అందుకోసం వ్యాయామ ఉపాధ్యాయులు ప్రతిరోజూ ఒక గంట సమయం విద్యార్థినీ,విద్యార్థులకు ఆటలలో,యోగాసనాలలో శిక్షణ ఇవ్వాలన్నారు.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన స్థానిక అంతర్జాతీయ కబడ్డీ క్రీడాకారులు నక్కల అర్జునరావు మాట్లాడుతూ విద్యార్థులు ఆటలతో పాటు చదువులో కూడా ప్రతిభ కనబరిచినట్లయితే శారీరక, మానసిక వికాసంతో పాటు జీవితంలో ఉద్యోగ భద్రతకు కూడా అవకాశం ఉంటుందని తానేసాక్ష్యమన్నారు. నియోజకవర్గంలోని చీరాల, వేటపాలెం మండల విద్యార్థులకు సంయుక్తంగా అథ్లెటిక్స్, షటిల్ బ్యాడ్మింటన్, యోగా, వాలీబాల్, కబడ్డీ,ఖోఖో, చెస్ పోటీలు నిర్వహించారు.ఈ పోటీలను చీరాల,వేటపాలెం మండల వ్యాయామ ఉపాధ్యాయులు పర్యవేక్షణలో జరిగాయి. విజేతలుగా నిలిచేందుకు అవసరమైన సూచనలు అందజేశారు.
వ్యాయామ ఉపాధ్యాయులు అందరు కలసి స్థానిక హెచ్ ఎమ్ అయిన ఎమ్. శేఖరరావును, స్థానిక పిడిలు కె. నాగేశ్వరరావు, టి.వెంకటేశ్వర్లును,స్టాఫ్ సెక్రటరీ బి.మోహ నరావును శాలువా,బొకేతో సత్కరించారు. మండల విద్యాశాఖ అధికారి ఎస్ .పురుషోత్తమ రావు, ఎస్ఎంసి చైర్మన్ చెరుకూరి రాంబాబు, ఊటు కూరు శ్రీమన్నారాయణ, అంతర్జాతీయ వాలీబాల్ క్రీడాకారుడు పిచ్చుక నాగరాజు,జాతీయస్థాయి అథ్లెట్ ప్రదీప్ నాయుడు,హెచ్ఎం శేఖర్ రావు,అక్కయ్యపాలెం హెచ్ఎం భవనం బద్రి రెడ్డి, వేటపాలెం హెచ్ఎం వి. ఫణి సత్యనారాయణ, కొత్తపేట హెచ్ఎం జి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

విశాలాంధ్ర - యద్దనపూడి : గర్భిణీలు, బాలింతలు పౌష్టికాహారం తీసుకొనడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చునని సూపర్వైజర్ సిహెచ్ సుజాత అన్నారు.మండలంలోని కటారి వారిపాలెం గ్రామంలో పౌష్టికాహార మహోత్సవ వారోత్సవాలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిరుధాన్యాలలో ఉండే పోషకాలు వాటి ప్రాముఖ్యతను గురించి గర్భిణీలకు కిశోర బాలికలకు వివరించారు. అంగన్వాడీలు తయారుచేసిన పోషకాలను ప్రదర్శించారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు,ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

కొండబోట్లవారిపాలెంలో 'స్వచ్ఛత హీ సేవా'

విశాలాంధ్ర - బాపట్ల రూరల్ : మండలంలోని కొండబోట్లవారిపాలెంలో గురువారం స్వచ్ఛత హీ సేవా కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బాపట్ల పార్లమెంట్ మహిళా ప్రధాన కార్యదర్శి పల్లం సరోజి జీవన్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సబ్ యూనిట్ ఆఫీసర్ షకీల్,రాంబాబు,హెల్త్ సూపర్వైజర్ బాపట్ల టౌన్ ధనలక్ష్మి, సిహెచ్ఓ మహాలక్ష్మి,తెలుగు యువత అధ్యక్షుడు ఉమ్మారెడ్డి వెంకటేష్,గ్రామ పార్టీ అధ్యక్షుడు కొండలు,బూత్ ఇంచార్జ్ మార్పు ప్రతాప్,హెల్త్ ఇన్స్పెక్టర్, ఫీల్డ్ అసిస్టెంట్ వాసు,కె.వి పాలెం జిల్లా పరిషత్ స్కూల్ సిబ్బంది,విద్యార్థులు గ్రామ సచివాలయ అధికారులు, నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షోభంలోనూ సంక్షేమం కోసం ప్రభుత్వం

ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు

విశాలాంధ్ర-కొల్లూరు : సంక్షోభ పరిస్థితుల్లోనూ ప్రజా సంక్షేమం కోసం పాటుపడుతున్న ఏకైక ప్రభుత్వం కూటమి నేతృత్వంలోని తమ ప్రభుత్వమని వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు అన్నారు. గురువారం కొల్లూరు మండలపరిధిలోని అనంతవరంలో నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన గ్రామంలో పర్యటించి సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రూ. 11 వేల కోట్లు అప్పులు చేసి రాష్ట్రాన్ని అప్పుల ఊబిలో ముంచి వెళితే సీఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలో ప్రభుత్వం అప్పులను అధిగమించి రాష్ట్ర అభివృద్ధి కోసం పాటుపడేందుకు పరితపిస్తుందన్నారు. విజయవాడ, కృష్ణా నది వరదల సమయంలో సీఎం నిరంతరం శ్రమించి అధికారులను, ప్రజాప్రతినిధులను అప్రమత్తం చేస్తూ ప్రజల ప్రాణాలకు నష్టం వాటిల్లకుండా కాపాడగలిగారని కొనియాడారు. టీడీపీ మండలాధ్యక్షుడు మైనేని మురళీకృష్ణ, మాజీ ఎంపీపీ కనగాల మధుసూదనప్రసాద్, జనసేన నియోజకవర్గ సమన్వయకర్త ఊసా రాజేష్ తదితరులు పాల్గొన్నారు.